ప్రజాశక్తి
శనివారం 31 డిసెంబర్ 2022 8 పేజీలు
గుంటూరు పల్నాడు





పనుల్లేక నిస్తేజం

- అధికారుల ప్రతిపాదనలకు దక్కని అనుమతులు
- అమలుకు నోచుకోని సీఎం హామీలు
- ప్రత్తిపాడు, నర్సరావుపేటలో ప్రారంభమవ్వని పనులు
- రోడ్లు, భవనాల శాఖలో ఇదీ పరిస్థితి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి



జిల్లాలో రహదారుల మరమ్మత్తులు, నిర్మాణం కోసం అధికారులు పంపిన ప్రతిపాదనలకు ప్రభుత్వం నుంచి అనుమతులు రాకపోవడంతో ఆర్అండ్బి శాఖ అధికారులు పనుల్లేక నిస్తేజంగా గడుపుతున్నారు. ఈ ఏడాది జనవరి ఒకటిన సిఎం జగన్ ప్రత్తిపాడులో ఇచ్చిన హామీలింకా కార్యరూపం దాల్చలేదు. అధికారులు వీటిపై పంపిన ప్రతిపాదనలకు ఆర్థిక శాఖ నుంచి ఆమోదం లభించలేదు. నర్సరావుపేటలో గత ఏప్రిల్లో సిఎం జగన్ ఇచ్చిన హామీలు కూడా అమలుకు నోచుకోలేదు.

2022-23లో గుంటూరు జిల్లాలో 194 కిలో మీటర్ల రహదారుల అభివృద్ధికి రూ.68.86 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు పంపగా ఆమోదం లభించలేదు. పల్నాడు జిల్లాలో 291 కిలో మీటర్లకు రూ.69.16 కోట్లతో పంపిన ప్రతిపాదనలకు మోక్షం దక్కలేదు. రహదారుల అభివృద్ధికి పెట్రోలు, డిజిలుపై వినియోగించిన రూపాయి సెస్సు సొమ్ములు కూడా విడుదల కావడం లేదని అధికార వర్గాల ద్వారా తెలిసింది. గతేడాది ఎడిబి బ్యాంకు నుంచి తీసుకున్న రుణంలో జిల్లాకురూ.47 కోట్లు మాత్రమే వచ్చాయి. వీటితో కొన్ని రోడ్లు అభివృద్ధి చేశారు.

జిల్లాలో 194 కిలో మీటర్ల రహదారులు అత్యవసరంగా మరమ్మత్తులు చేయాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. ఎక్కువరద్దీగా ఉండే మార్గాల్లో ప్యాచ్ వర్కులు చేస్తున్నారు. ప్రత్తిపాడులో గత జనవరి ఒకటో తేదీన సిఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు రహదారుల అభివృద్ధికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. ఆర్థిక శాఖ అనుమతి రాలేదు. ప్రత్తిపాడులో డబల్ లైన్ రహదారులు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు సిఎం హామీ ఇచ్చారు. రహదారి అభివృద్ధికి ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి. ఏప్రిల్ 7వ తేదీన నర్సరావుపేటలో వాలంటీర్ల సదస్సులో పాల్గొన్న సందర్భంగా సిఎం జగన్ ఇచ్చిన హామీలపై ఇంకా కార్యచరణ సిద్ధం కాలేదు.

గుంటూరులో శంకర్ విలాస్ వద్ద బ్రిడ్జి విస్తరణ, అభివృద్ధికి

2లో



భవనాన్ని ప్రారంభిస్తున్న భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై.చంద్రచూడ్

జ్యుడిషియల్ అకాడమి భవనం ప్రారంభం

కాజాలో భారత ప్రధాన న్యాయమూర్తికి ఘన స్వాగతం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మండంలోని కాజాలో ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ న్యాయాధికారుల శిక్షణా కేంద్రాన్ని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధనంజయ వై.చంద్రచూడ్ శుక్రవారం ప్రారంభించారు. శిక్షణా కేంద్రంలోని పలు విభాగాలను పరిశీలించి జ్యుడిషియల్ అధికారులతో గ్రూపు ఫొటో దిగారు. న్యాయాధికారుల శిక్షణ కేంద్రం చేరుకున్న భారత ప్రధాన న్యాయమూర్తికి జ్యుడిషియల్ అధికారులు ఘన స్వాగతం పలికగా అనంతరం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. న్యాయ వ్యవస్థలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం పెరిగిందని, సాంకేతికతను అందిపుచ్చుకునేలా డిజిటలైజేషన్ ప్రక్రియకు శ్రీకారం చుట్టామని చెప్పారు. సాంకేతికతకు అనుగుణంగా మార్పులు చేసుకోవాలని, ఇది కేసుల సత్వర పరిష్కారానికి ఉపయోగపడుతుందని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానం సామాన్యులకి న్యాయ సేవలను చేరువ చేస్తుందని ఆశిస్తున్నానని అన్నారు. హైకోర్టులో డిజిటలైజేషన్ కేంద్రం ఏర్పాటు, తీర్పులు ఆన్లైన్ లో సామాన్యులకు అందుబాటులోకి రావటం

2లో

కోర్టు స్టేతో నిలిచిన ఉపాధ్యాయ బదిలీలు

- రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్
- ప్రశ్నలకు సమాధానం ఇవ్వబోమని మీడియాపై ఆగ్రహం

2 లో

అక్రమ వెంచర్లపై చర్యలు : జెసి

2 లో

నేరాలను తగ్గించగలిగాం

పల్నాడు జిల్లా వార్షిక నేర గణాంకాలను విడుదల చేసిన ఎస్పీ రవిశంకర్రెడ్డి

ప్రజాశక్తి - నరసరావుపేట



రాత్రి వేళ పట్టణాల్లో గస్తీ, పగటి వేళల్లో గ్రామాల్లో ప్రత్యేక పర్యవేక్షణ ద్వారా నేరాల నియంత్రణకు కృషి చేస్తున్నామని పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్రెడ్డి చెప్పారు. గత మూడేళ్లతో పోలిస్తే పల్నాడులో 2022లో నేరాలు తగ్గుముఖం పట్టాయని అన్నారు. జిల్లా వార్షిక నేర గణాంకాలపై స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఆయన వివరించారు.

కిడ్నాప్ కేసులు 100 శాతం ఛేదించామన్నారు. 2022లో 35 హత్య కేసులు నమోదు కాగా 32 కేసులను ఛేదించామని, మర్డర్ ఫర్ గైన్ ఈ ఏడాది 3 కేసులు నమోదు కాగా వాటినీ ఛేదించి రూ.7.20 లక్షలకు గాను రూ.7.14 లక్షలు రికవరీ చేశామన్నారు. గత మూడేళ్లతో పోలిస్తే 11 శాతం రోడ్డు ప్రమాదాలు, 13 శాతం మరణాలను తగ్గించామన్నారు. ఆస్తుల వ్యవహారంలో 74.42 శాతం కేసులు ఛేదించగా 4227 కేసుల్లో విచారణ పూర్తయ్యి 759 మందికి శిక్షలు పడ్డాయని తెలిపారు.

కోడిపందేలపై 262 కేసులను నమోదుచేసి 1687 మందిని అరెస్టు చేశామని, రూ.49.52 లక్షలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. క్రికెట్ బెట్టింగ్పై 2 కేసులు నమోదుచేసి, 11 మందిని అరెస్ట్ చేసి, రూ.10,650, ఒక లాప్ టాప్, 5 ఫోన్లను సీజ్ చేశామని చెపాపరు. ఈ-చాలనాల రూపంలో

2లో



నాయకుల ఎదుటే వాగ్వాదాలకు దిగిన కార్యకర్తలు.. నచ్చజెప్పే ప్రయత్నంలో నాయకులు

వైసిపిలో ముఠాపోరు

- తాడికొండ సమావేశాల్లో గలభా
- ఎమ్మెల్యే ప్రసంగానికి బ్రేకు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

తాడికొండ నియోజకవర్గం వైసిపిలో ముఠాపోరు మరోసారి బహిర్గతమైది. వాలంటీర్లతో కన్వీనర్ల సమన్వయంపై శుక్రవారం తాడికొండ, పేరేచర్లలో జరిగిన సమావేశాల్లో ఎమ్మెల్యే అనుకూల, వ్యతిరేక గ్రూపుల మధ్య గలభా జరిగింది. తాడికొండలో తాడికొండ, తుళ్లూరు నియోజకవర్గాల సమావేశం జరిగింది. ఇందులో ఆ పార్టీ పరిశీలకులు, ఇన్ఛార్జిలుగా ఎంపి ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, జిల్లా సమన్వయకర్త మర్రి రాజశేఖర్, బ్రహ్మానందరెడ్డి హాజరయ్యారు. తమ ఎమ్మెల్యే ప్రవర్తనతో పార్టీకి నష్టం జరుగుతుందంటూ కొందరు కార్యకర్తలు విమర్శించారు. ముఖ్య నాయకులు మాట్లాడిన తరువాత ఎమ్మెల్యే శ్రీదేవి మాట్లాడబోతుండగా ఆమె వ్యతిరేక గ్రూపు అడ్డుకుంది. అనంతరం మర్రి రాజశేఖర్ మాట్లాడారు. కార్యకర్తల ప్రవర్తన బాగా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యకర్తలు బెదిరిస్తే పార్టీ భయపడదని అన్నారు. అన్ని నియోజకవర్గాల్లో పార్టీలో వివిధ సమస్యలు ఉన్నాయని తెలిపారు. కార్యకర్తల సమస్యలు పరిష్కరించేందుకే గ్రామాలో తిరుగుతున్నామని చెప్పారు. కార్యకర్తల సమస్యలు

2లో



పెత్తందార్లను అరెస్టు చేయకుంటే దీక్షలు

అత్తలూరు సర్పంచ్ ఘటనలో దళిత, గిరిజన, ప్రజా సంఘాల హెచ్చరిక

ప్రజాశక్తి - అమరావతి

అత్తలూరు సర్పంచ్ బంకా సరోజినీ విధులకు ఆటంకం కలిగించి అవమానించి దాడి చేయబోయిన కేసులో నిందితులను వెంటనే అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని దళిత గిరిజన ప్రజాసంఘాలు నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం తల్లం బ్రహ్మయ్య స్మారక భవన్లో జరిగిన విలేకరుల సమావేశంలో కుల వివక్షత పోరాట సమితి (కెవిపిఎస్) పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు మాట్లాడుతూ అత్తలూరు సర్పంచ్ను దూషించి దాడి చేయబోయిన మదమంచి సతీష్, సింగమనేని నరసయ్య, పంచాయతీ కార్యదర్శి బిక్కి సుధాకర్, స్వీపర్ వెంకటకృష్ణపై అక్టోబర్ 31 తేదీన కేసు నమోదైనా వారినింకా అరెస్టు చేయకపోవడం అన్యాయమన్నారు. చట్ట ప్రకారం 30 రోజుల్లోపు విచారణ చేసి నిందితులను

2లో



మెరుగైన విద్యుత్ సేవలకు చర్యలు

ప్రజాశక్తి-గుంటూరు

మెరుగైన విద్యుత్ సేవలు అన్ని వర్గాల వినియోగదారులకు అందించే విధంగా ఖచ్చితమైన చర్యలు తీసుకోవాలని ఇంధన శాఖ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్నారు. ఎపిసిపిడిసిఎల్ సిఎండి పద్మజనార్ధనరెడ్డితో కలిసి గుంటూరులో స్థానిక పొన్నూరు రోడ్డులోని విద్యుత్ భవనంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఎవరైతే ఇళ్లు నిర్మించుకున్న వారికి 24 గంటలలోగా విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన అర్జీలు తక్షణమే పరిష్కరించాలని విద్యుత్ శాఖ ఎస్ఈ మురళికృష్ణ యాదవ్‌ను, సిఆర్‌డిఎ ఇన్‌చాజ్జి పి.విజయబాబును ఆదేశించారు. విద్యుత్ ప్రమాదాలు జగకుండా జాగ్రత్తలు తీసుకవాలని, ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లైన్ల మరమ్మతులో ఎలాంటి అలసత్వం ఉండకూడదన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ డైరెక్టర్ శ్రీనివాసులు, ఇఇలు, ఎడిఇలు పాల్గొన్నారు.

'కొత్త సంవత్సరంలోనైనా విధానాలు మార్చుకోండి'

ప్రజాశక్తి–తెనాలి: అభివద్ధి పనులలో అధికారుల నిర్లక్ష్యం కౌన్సిలర్లకు వార్డులో సవాలుగా మారుతోందని అధికార పార్టీ కౌన్సిలర్లే ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న చిన్న పనులు సైతం రోజుల తరబడి పారబెట్టడంతో వార్డు ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారన్నారు. కనీసం నూతన సంవత్సరంలోనైనా పద్ధతి మార్చుకోవాలని పాలకవర్గాన్ని హెచ్చరించారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్ అధ్యక్షతన జరిగింది. సమావేశం అనంతరం జీరో అవర్లో పలువురు వైసిపి కౌన్సి లర్‌లు మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు అభివృద్ధి పను లపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అధికారుల మధ్య సమ న్వయ లోపంతో పనుల్లో జాప్యం జరుగుతుందని ఆరోపిం చారు. దీనిపై స్పందించిన ఎంఈ కె.నాగ మల్లేశ్వరరావు బదులిచ్చారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్లపై ఉదాసీన వైఖరి ఎందుకని, కొత్తవారికి వాటిని అప్పగిస్తే పరిస్థితిలో మార్పు వచ్చే అవకాశం ఉంటుందనే అభిప్రాయం వైసిపీ కౌన్సిలర్‌లు వ్యక్తం చేశారు. అంతలో చైర్‌పర్సన్ జోక్యం చేసుకుని ఇంజనీరింగ్, ప్రజారోగ్య, టౌన్ ప్లానింగ్ విభాగ అధికారులు పూర్తిగా నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారని,ఇదే పరిస్థితి కొనసాగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అజెండాలోని 26వ అంశం చదవటం పూర్తికాగానే టీడీపీ కౌన్సిలర్‌లు అన్నం పిన్నారావు, పసుపులేటి త్రిమూర్తిలు లేచి 13వ ఆర్థిక సంఘ పనులకు సాధారణ నిధులు ఏలా కేటాయిస్తారని ప్రశ్నించారు.

నేరాలను తగ్గించగలిగాం

(మొదటి పేజీ తరువాయి)

78,096 కేసులు నమోదు చేసి రూ.1.57 కోట్లు జరిమానా విధించామన్నారు. 1503 బెల్ట్ షాపులపై కేసులు నమోదు చేసి 215 మందిని అరెస్ట్ చేసి 13693 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. 186 నాటు సారాయి తయారీ దారులపై కేసు నమోదు చేసి 26291 లీటర్ల నాటు సారా ధ్వసం చేయగా 98 గుట్కా కేసులు నమోదు చేసి 163 మందిని, పిడి యాక్ట్ కింద 15 మందిపై, ఇసుక అక్రమ రవాణాపై 68 కేసులు నమోదు చేసి 113 మందిని అరెస్టు చేసి రూ.863.4 టన్నుల ఇసుక, 11 లారీలు, 80 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాపై కేసులు నమోదు చేసి 102 మందిని అరెస్టు చేసి 656 టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) జి.బిందుమాధవ్, అదనపు ఎస్పీ (ఏఆర్) రామచంద్రరాజు, నరసరావుపేట డీఎస్పీ విజయభాస్కర్‌రావు, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ షప్రుద్దీన్, ఎఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, ఎస్‌బి సిఐ ప్రభాకర్, సిఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

కోర్టు స్టేతో నిలిచిన ఉపాధ్యాయ బదిలీలు

- రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్
- ప్రశ్నలకు సమాధానం ఇవ్వబోమని మీడియాతో గరంగరం
- సమస్యలను ప్రస్తావించిన వారిపై దురుసు ప్రవర్తన

ప్రజాశక్తి - వినుకొండ

కోర్టు స్టే కారణంగా రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ నిలిచిపోయిందని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్ అన్నారు. శుక్రవారం వినకొండలోని కేజీబీవీని, యడ్లపాడు మండలం సొలసలోని జెడ్‌పి పాఠశాలను ఆయన సందర్శించారు. వినుకొండలో ఆయన మాట్లాడుతూ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉందని, సబ్జెక్టుల వారిగా ఉపాధ్యాయులను నియమించేందుకు బదిలీ ప్రక్రియ చేపడితే కొందరు కోర్టును ఆశ్రయించడంతో ప్రక్రియ నిలిచిందని అన్నారు. 70 వేల మంది ఉపాధ్యాయులను బదిలీ చేయాల్సి ఉండగా దానిలో 1500 మంది ఉపాధ్యాయులు కోర్టుకు వెళ్లినట్లు చెప్పారు. కోర్టు స్టే వింమించుకోగానే ఉపాధ్యాయుల బదిలీలు పూర్తయ్యి కొరత తీరుతుందన్నారు. రాబోయే విద్య సంవత్సరం నుంచి ఆరో తరగతి నుండి అన్ని తరగతులను డిజిటలైజేషన్ చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న ట్యాబ్ పంపిణీ 95 శాతం పూర్తయిందని, విద్యార్థులకు వీటిపై అవగాహన కల్పిస్తామని చెప్పారు.

మీడియా ప్రశ్నలకు సమాధానం చెప్పను..

మోడల్ స్కూల్‌లో విద్యుత్ బకాయిల చెల్లింపు కొన్నేళ్లుగా నలిచిపోవడం, సరఫరా నిలిపివేత, తదితర అంశాలపై ఆయున్ని మీడియా ప్రశ్నించగా వాటికి తాను సమాధానం ఇవ్వనని ప్రవీణ్ ప్రకాష్ అన్నారు. చెప్పింది వింటే వినండి లేదంటే వెళ్తాను.. అని వెళ్లిపోయారు.



పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు అనేకంగా ఉన్నాయని, ఆకస్మిక తనిఖీలు చేస్తే అవి తెలుస్తాయని ఓ విలేకరి చెప్పగా ఆయనపైనా ప్రవీణ్ ప్రకాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు సలహాలు ఇవ్వాల్సిన అవసరం లేదు.. అని అన్నారు. జెసి ఎ.శ్యాం ప్రసాద్, డిఇఒ ఎం.వెంకటప్పయ్య, ఆర్డీవో శేషిరెడ్డి, తహశీల్దార్ కిరణ్ కుమార్, ఎంఇఒలు జప్రుల్లా, ఎ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

అక్రమ వెంచర్లపై చర్యలు : జెసి

ప్రజాశక్తి - వినుకొండ

అక్రమంగా వేసిన వెంచర్లపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని పల్నాడు జిల్లా జెసి ఎం.శ్యాంప్రసాద్ చెప్పారు. సాదారణ తనిఖీల్లో భాగంగా వినుకొండకు శుక్రవారం వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ వ్యవసాయ భూములను వ్యవసాయేత భూములుగా అనుమతులు పొందకుండా వెంచర్ల వేయడం వలన భూములు సబ్ డివిజన్ కాక ప్రజా ఉపయోగాలకు చెందిన తాగునీటి పైపులైన్లు, పంట కాల్వలు కలిసిపోతున్నాయని చెప్పారు. దీనివలన తీవ్ర నష్టం ఉంటుంది కాబట్టి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ల్యాండ్ కన్వర్షన్‌కు చలానా చెల్లించి డిటిసిపి ద్వారా అనుమతులంటూ వెంచర్లు వేయడం సరికాదని, భూమి సబ్ డివిజన్ కాకుండా వెంచర్లు వేయకూడదని స్పష్టం చేశారు. జిల్లావ్యాప్తంగా ఉన్న అనధికారిక వెంచర్లపై విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

జిల్లాలో భూ రీ సర్వే వేగవంతంగా జరుగుతోందని, 3 లక్షల ఎకరాలకుగాను 2 లక్షల ఎకరాల్లో రీ సర్వే పూర్తయిందని తెలిపారు. 145 రెవెన్యూ గ్రామాల్లో సర్వే పూర్తవగా 37 రెవిన్యూ గ్రామాల్లో జరగాల్సి ఉందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా పంటను కొంటున్నామన్నారు. అనంతరం పట్టణంలోని లాయర్ స్ట్రీట్‌లో సచివాలయాన్ని సందర్శించారు. రైల్వే గేట్ వద్ద రేషన్ షాపును తనిఖీ చేసి కార్డు దారుల వద్ద నుండి



వివరాలు సేకరించారు. జనవరి నుండి కంది పప్పు, పంచదార కూడా పంపిణీ చేస్తామని చెప్పారు. జెసి వెంట జిల్లా పౌర సరఫరాల అధికారి జి.మోహన్‌బాబు, ఆర్డీవో ఎం.శేషిరెడ్డి, తహశీల్దార్ బి.కిరణ్ కుమార్, సివిల్ సప్లయిస్ డిటి జి.విద్యాసాగర్ ఉన్నారు.

పనుల్లేక నిస్తేజం

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించి గత నెల 11న సిఎం జగన్ ఇచ్చిన హామీపై కదలిక లేదు. ఉన్నతాధికారులు ఇంకా ప్రతిపాదనలు కూడా పూర్తిగా పంపకపోవడం వల్ల డిపిఆర్ తయారు కాలేదు. జిల్లాలో కొన్నేళ్లుగా రహదారుల అభివృద్ధి లేకపోవడం వల్ల ప్రధాన రహదారులు కూడా దెబ్బతిన్నాయి. ఇందువల్ల పలు ప్రాంతాల్లో ప్రజలు నరక యాతన అనుభవిస్తున్నారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో అనేక మంది రహదారులు నిర్మాణానికి ముందుకు రాక పలుమార్లు టెండర్లు పిలవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అత్యవసర పనులు చేయడానికి కూడా అధికారులు శ్రమి స్తున్నా రు.

జ్యుడిషియల్ అకాడమి భవనం ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

సంతోషకరమన్నారు. దిగువకోర్టులో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఆంధ్రప్రదేశ్లో న్యాయ వ్యవస్థలో పురు



షులతో సమానంగా మహిళలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. భారత ప్రధాన న్యాయమూర్తికి స్వాగతం పలికిన వారిలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, ఎపి జ్యుడిషియల్ అకాడమి బోర్డు ఆఫ్ గవర్నస్ హైకోర్టు న్యాయ మూర్తులు జస్టిస్ ప్రవీణ్ కుమార్, జస్టిస్ ఆకుల శేషసాయి, జస్టిస్ యు.దుర్గా ప్రసాద్, జస్టిస్ ఎస్ఎస్ సోమయాజులు, జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్, హైకోర్టు న్యాయ మూర్తులు, ఆంధ్రప్రదేశ్ జ్యుడి షియల్ అకాడమి డైరెక్టర్ ఎం.హరిహర నాథశర్మ, ఏ.పి హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ డాక్టర్ వై.లక్ష్మణరావు, గుంటూరు జిల్లా జడ్జీ వై.వి.ఎస్.బి.జి. పార్థసారధి, లా సెక్రటరీ సత్యప్రభాకర్, గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, అడిషనల్ ఎస్పీ సుప్రజ, ఎంటిఎంసి కమిషనర్ శారద, అధికారులు ఉన్నారు.

పెత్తందార్లను అరెస్టు చేయకుంటే దీక్షలు

(మొదటి పేజీ తరువాయి)

అరెస్టు చేయాల్సి ఉందని, అరెస్టు చేయకపోవడానికి కారణం ఏమిటని ప్రశ్నించారు. నిందితులు రాజకీయ అండ చూపుకుని బాధితులనే బెదిరిస్తున్నారని, ఇప్పటికైనా అరెస్టు చేయకుంటే అమరావతిలోని గౌతమ బుద్ధుని విగ్రహం ముందు దీక్షలకు పూనుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో దళిత, గిరిజన, ప్రజాసంఘాల నాయకులు వి.పాపారావు, డి.కోటేశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు, షేక్ మోహిద్దీన్, చిట్టిమాల రాజు, బి.సూరిబాబు, కె.వెంకటేశ్వరరావు, ఎస్.రాజకుమార్, కె.దానియేలు పాల్గొన్నారు.

వైసిపిలో ముఠాపోరు

(మొదటి పేజీ తరువాయి)

తెలుసుకునేందుకు పార్టీ ప్రత్యక బృందాన్ని ఏర్పాటు చేసిందని, సమస్యలేమైనా ఉంటే సామరస్యంగా మాట్లాడుకోవాలని ఆయన పేర్కొన్నారు. కార్యకర్తల ఆగ్రహంతో, తాడికొండ ఎమ్మెల్యే శ్రీదేవి మాట్లాడకుండానే సభ నుంచి వెళ్లిపోయారు. మర్రిరాజశేఖర్ జోక్యం చేసుకుని ఆ సమావేశం వాలంటీర్లకు సంబంధించిందని, మీరు అనసరంగా గొడవ చేస్తున్నారని అనడంతో అయితే తమతో సంబంధం లేకుండా మీరే నిర్వహించుకోండని పలువురు కార్యకర్తలు బయటకు వెళ్లారు. తిరిగి వారిని రప్పించేందుకు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, బ్రహ్మనందరెడ్డి సర్దిచెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా కొంత మంది ఆరోపణలు చేశారు. చివరికి పోలీసులు రంగ ప్రవేశం చేసి సర్దుబాటు చేశారు. పేరేచర్లలో జరిగిన సమావేశంలో శ్రీదేవి అనుకూల గ్రూపు ఎక్కువగా ఉండటంతో రెండు వర్గాల మధ్య ఢీ అంటే ఢీ అనే పరిస్థితి ఏర్పడింది. ఇరు గ్రూపుల మధ్య ఘర్షణ జరిగింది. అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ తదితరులు ప్రసంగించారు. అయితే పార్టీ జిల్లా అధ్యక్షులు డొక్కా మాణిక్యవర ప్రసాద్ ఈ సమావేశానికి దూరంగా ఉన్నారు.

ఘనంగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) 53వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం గుంటూరు నగరంలో కళాశాలల వద్ద విద్యార్థులు సంఘం జెండాలను ఆవిష్కరించారు. ఆంధ్ర క్రైస్తవ కళాశాల వద్ద జరిగిన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జాతీయ కమిటీ సభ్యులు షేక్.నాగూర్‌బి ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. 1970లో ఎస్ఎఫ్ఐ స్వాతంత్ర్య, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యాలతో త్రివేంద్రంలో ఏర్పడిందన్నారు. అప్పటి నుండి చదువుతూ పోరాడు, చదువుకై పోరాడు అనే నినాదంతో విద్యార్థుల సమస్యలపై రాజీలేకుండా పోరాడుతున్న ఏకైక సంఘం ఎస్ఎఫ్ఐ అని చెప్పారు.

విద్యార్థుల సమస్యలపై పోరాడటమే కాకుండా విద్యా ర్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచటానికి కృషి చేస్తోందన్నారు. అనంతరం హిందూ కాలేజి వద్ద ఎస్ఎఫ్ఐ జెండా ఆవిష్క రించారు. కార్యక్రమంలో



హిందూ కాలేజి వద్ద జెండా ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు, విద్యార్థులు

నగర అధ్యక్ష, కార్యదర్శులు రూపస్, సుధీర్, నగర నాయకులు చందు, వీనేష్, బాల, సమీర్, పద్మ, జాకీర్, సంధ్య పాల్గొన్నారు.



గంజాయిని తగలబెడుతున్న పోలీసు అధికారులు

మరోసారి గంజాయి దహనం

ప్రజాశక్తి - మేడికొండూరు

వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న గంజాయి, లిక్విడ్ గంజాయిని మండలంలోని పేరేచర్ల కైలాసగిరి సమీపంలోని పోలీస్ ఫైరింగ్ రేంజ్ సమీపంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెర్ (సెబ్) అధికారులు శుక్రవారం ధ్వంసం చేశారు. గుంటూరు జిల్లా పరిధిలో గుంటూరు-1, గుంటూరు-2 , తెనాలి సబ్ స్టేషన్ పరిధిలో 36 కేసుల్లో స్వాధీనం చేసుకున్న రూ.7.73 లక్షల విలువ చేసే 154.619 కిలోల గంజాయి, రూ.2.67 లక్షలు విలువ చేసే 1.782 లీటర్ల లిక్విడ్ గంజాయి, హషిష్ ఆయిల్ మొత్తం రూ.10.40 లక్షలు విలువచేసే గంజాయిని దహనం చేశారు. ఇదే ప్రదేశంలో ఇటీవల భారీస్థాయిలో గంజాయిని ఐజి ఆధ్వర్యంలో దహనం చేసిన విషయం తెలిసిందే. కార్యక్రమంలో నెల్లూరు జోన్ సబ్ డిప్యూటీ కమిషనర్ కె.హేమంత్ నాగరాజు, గుంటూరు జిల్లా సబ్ అడివినల్ ఎస్పీ డిఎన్ మహేష్, రెవెన్యూ, సెబ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేడుకల్లో అల్లర్లు వద్దు : ఎస్ఐ

ప్రజాశక్తి - బెల్లంకొండ

నూతన సంవత్సర వేడుకలను యువత గొడవలు, అల్లర్లు లేకుండా నిర్వహించుకోవాలని ఎస్ఐ సుధీర్ కుమార్ సూచించారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆయన మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా అవాంఛనీయ ఘటనలు జరిగితే అందుకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 31వ తేదీ రాత్రి తప్పనిసరిగా అన్నిచోట్ల డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడతామన్నారు. గ్రామాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకోవాలంటే తప్పనిసరిగా పోలీస్, పంచాయతీ కార్యదర్శుల అనుమతులు తీసుకోవాలని సూచించారు.

షాపుల అద్దెలు తగ్గింపునకు కౌన్సిల్ ఆమోదం

ప్రజాశక్తి - మాచర్ల

స్థానిక ప్రభుత్వాస్పత్రి వద్ద పురపాలక సంఘ కాంప్లెక్స్‌లోని పలు షాపులు అడ్వాన్స్‌లు, అద్దెలు హెచ్చుగా ఉండటంతో వాటి మార్పుకు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. శుక్రవారం ఉదయం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. మున్సిపల్ కాంప్లెక్స్‌లో గతంలో అడ్వాన్స్‌లు రూ.2 లక్షలు, అద్దె రూ.4 వేలుగా నిర్ణయించటంతో చాల కాలంగా ఆయా షాపులు చాల ఖాళీగా ఉన్నాయని, అద్దెల్లో మార్పులు చేసి ఎసీ, ఎస్టీ, బీసీ, వికలాంగులకు, డ్వాక్రా మహిళలకు ప్రాధాన్యమివ్వాలని పలువురు సభ్యులు కోరారు. ఈ మేరకు కౌన్సిల్ సమావేశంలో సవరణలు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అడ్వాన్స్ రూ.70వేలు, అద్దె రూ.3వేలు, వికలాంగులకు రూ.1,500, మహిళా పొదుపు సంఘాలకు వీటిలో ప్రాతినిధ్య కల్పిస్తూ కౌన్సిల్ తీర్మానించింది. ఇదిలా ఉండగా ఎజెండాలోని 9 అంశాలు ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, కమిషనర్ ఇవి రమణబాబు, అధికారులు, కౌన్సిలర్స్ పాల్గొన్నారు.



మాచర్ల మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ బోయ రఘురామిరెడ్డి



ఎంపిజిఇఎ కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కొల్లిపర : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఎపిజిఇఎ) కేలండర్‌ను తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమాని కి సంఘం దుగ్గిరాల యూనిట్ అధ్యక్షులు అందే బాలచంద్రమౌళి అధ్యక్షత వహించగా తహశీల్దార్ జి.నాంచారయ్య, డిటి ఎల్.బాలకష్ణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వి.చంద్రమోహన్, పి.వెంకటేశ్వరరావు ఎ.వేణుగోపాలరావు పాల్గొన్నారు

5వ తేదీ వరకూ 144 సెక్షన్

మాచర్లలో మరోసారి పొడిగించిన అధికారులు

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల పట్టణంలో 144 సెక్షన్ 5వ తేదీ వరకు అమలులో ఉంటుందని అర్బన్ సిఐ బాలకృష్ణ తెలిపారు. మాచర్ల పట్టణంలో డిసెంబర్ 16న వైసిపి-టిడిపి మధ్య ఘర్షణతో పట్టణం అట్టుడికింది. అప్పటి నుండి పట్టణంలో 144 సెక్షన్ అమలులోకి వచ్చింది. తొలి విడతగా ఈ నెల 17వ తేది నుండి 20వ తేది వరకు అమలు చేయగా, తదనంతరం పొడిగిస్తూ వస్తున్నారు. తాజాగా జనవరి 5 వరకు 144 సెక్షన్ కొనసాగిస్తూ తహశీల్దార్ ఉత్తర్వులిచ్చినట్లు సిఐ తెలిపారు. ఈ నేపథ్యంలో పట్టణంలో పలు కూడళ్లలో పోలీసు బందోబస్తు కొనసాగుతోంది.

మాచర్లలో 3న జాబ్‌మేళా

ప్రజాశక్తి - మాచర్ల : మున్సిపల్ కార్యాలయ ఆవరణలో జనవరి 3వ తేదిన జాబ్‌మేళా నిర్వహిస్తామని కమిషనర్ ఇవి రమణబాబు శుక్రవారం తెలిపారు. ఈ మేరకు తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ స్కిల్స్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళాలో హెటిరో డ్రగ్స్, రేతా ఫైనాన్స్, మేదా సర్వో డ్రైవర్స్ కంపెనీలు పాల్గొంటాయని, 110 ఉద్యోగాలకు భర్తీ ఉంటుందని, ఇతర వివరాలకు మున్సిపల్ కార్యాలయం పని వేళలలో సంప్రదించాలని సూచించారు.

లారీ ఢీకొని యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి - మేడికొండూరు

ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని కొర్రపాడు ప్రధాన సెంటర్లో శుక్రవారం చోటుచేసుకుంది. సత్తెనపల్లికి చెందిన చిలక సంతోష్ (28) గుంటూరులో ఒక ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. అందులో భాగంగా సత్తెనపల్లి నుంచి ద్విచక్ర వాహనంపై గుంటూరుకు బయలుదేరాడు. మార్గమధ్యలో కొర్రపాడు సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న లారీ ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టడంతో సంతోష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం జరిగిన వెంటనే లారీ ఆగకుండా వెళ్లిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలిని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.



అక్రమ మద్యం వాహనాలకు వేలం

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల ఎక్సైజ్ పోలీసుస్టేషన్ పరిధిలో కొంత కాలంగా మద్యాన్ని అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడిన పలు వాహనాలను శుక్రవారం వేలం నిర్వహించారు. 19 వాహనాలు అమ్ముడుపోయినట్లు సిఐ ప్రసాదరెడ్డి తెలిపారు. వేలాన్ని ఎక్సైజ్ సూపరింటెండెంట్ వి.చంద్రశేఖర్‌రెడ్డి పర్యవేక్షించారు.



పాఠశాలల్లో డిఇఒ పరిశీలన

ప్రజాశక్తి - కొల్లిపర

మండలంలోని అత్తోట, తుములూరు, కొల్లిపర జెడ్‌పి పాఠశాలలను డిఇఒ పి.శైలజ శుక్రవారం తనిఖీ చేశారు. 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీని పరిశీలించడంతోపాటు రికార్డులు, మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులతో కలసి భోజనం చేసినానంతరం పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై పలు సూచనలు చేశారు.



వీరాపురంలో రేషన్ దుకాణం తనిఖీ

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

మండల పరిధిలోని వీరాపురంలోని రేషన్ దుకాణంను శుక్రవారం గురజాల ఆర్డిఓ ఆదయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ దుకాణంలోని బియ్యం, ఇతర సరుకులలో ఎటువంటి వ్యత్యాసం లేదని అన్నారు. అలాగే, రేషన్ కార్డుదారులతో మాట్లాడి వారికి సరుకుల పంపిణీ ఎలా జరుగుతుందో అడిగి తెలుసుకున్నారు. 2023 జనవరి నెలకు సంబంధించిన బియ్యం,కందిపప్పు, పంచదార అన్ని రేషన్ దుకాణాలలో అందుబాటులో ఉంచామన్నారు. రేషన్ కార్డు లబ్ధిదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. తనిఖీలలో పిడుగురాళ్ల తహశీల్దార్ చక్రవర్తి, సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహశీల్దార్ శర్మ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

ప్రజాశక్తి-నాదెండ్ల

పరిసరాల పరిశుభ్రత పాటిస్తే దోమల వలన వచ్చే వ్యాధులను పారదోలవచ్చని పల్నాడు జిల్లా వైద్యాధికారి డాక్టర్ శోభారాణి తెలిపారు. తనిఖీలలో భాగంగా మండలం లోని గణపవరంలోని రాజీవ్ గాంధీ కాలనీలో శుక్రవారం ఆమె తనిఖీ నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఫ్రైడే డ్రై డే గా పాటించాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, దోమతెరలు తప్పనిసరిగా వాడాలని సూచించారు. దోమల ఉధృతి కారణంగా వైరల్ ఫీవర్లు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని మలే రియా వైద్యాధికారి రత్నాకర్ రవీంద్ర సూచించారు. ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారి ప్రసాద్ నాయక్ వైద్య పర్యవేక్షకులు షేక్ అజీజ్, నారాయణ, చలమారెడ్డి, జిలాని, కోటేశ్వరరావు, జ్యోతి పాల్గొన్నారు



మ్యూజియంను సందర్శించిన పురావస్తు శాఖ డైరెక్టర్

ప్రజాశక్తి-అమరావతి

ప్రపంచ పర్యాటక కేంద్రమైన అమరావతి మ్యూజియంను సందర్శిం చిన పురావస్తు శాఖ డైరెక్టర్ నవరత్న కుమార్ పాఠక్ శుక్రవారం సందర్శించారు. అనంతరం గౌతమ బుద్ధ మహా స్థూపంను సందర్శిం చారు. వీరి వెంట సూపరింటెండెంట్ ఆర్కియాలాజిస్ట్ గోపీనాథ్ జీనా, అసిస్టెంట్ సూపర్డెంట్ బోయ, అసిస్టెంట్ ఆర్కియాలాజిస్ట్ సూర్య ప్రకాష్, ఏఈ కన్జర్వేషన్ అసిస్టెంట్ నాగేంద్ర కుమార్, మ్యూజియం యుడిసి పనిధర్, ఇన్ఛార్జి టి.చిన్నబాబు, శ్రీను, లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేలో కాల్వ హద్దులు నిర్ణయించండి

- ఈపూరు మండలంలో డ్రోన్ సర్వే పూర్తి
- 104 గ్రామాల్లో ఒఆర్ఐ పటం వచ్చింది
- భూ రీ సర్వేను పరిశీలించిన జెసి శ్యాంప్రసాద్



గోపువారిపాలెంలో రికార్డులను పరిశీలిస్తున్న జెసి శ్యాంప్రసాద్

ప్రజాశక్తి-ఈపూరు

గ్రామాలలో జరుగుతున్న భూ రీ సర్వేకు రైతులు సహకరించాలని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. మండలంలోని చిట్టాపురం రెవెన్యూ గ్రామ పరిధిలోని గోపువారిపాలెం గ్రామంలో జరుగుతున్న భూ రీ సర్వేను ఏడి నాగశేఖర్‌తో కలిసి ఆయన పరి శీలిం చారు. ఇనుమెళ్ళ మేజర్ నుండి చిట్టా పురం మైనర్ కాలువను కొందరు ఆక్ర మించుకున్నారని రైతులు ఫిర్యాదు చేయ డంతో రీ సర్వేలో కాల్వహద్దులు నిర్ణ యిం చాలని తహశీల్దార్ సిహెచ్ విజయ జ్యోతి కుమారిని ఆదేశించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో జెసి మాట్లాడుతూ ఈపూరు మండలంలో డ్రోన్ సర్వే పూర్తయిందని ఏడు రెవెన్యూ గ్రామాలకు, జిల్లాలో 104 గ్రామాల్లో ఓఆర్ఐ పటం వచ్చిందన్నారు. గ్రామ సభల ద్వారా ముందుగా రైతులకు అవ గాహన కల్పించే విధంగా రెవెన్యూ అధికారులకు పలు సూచనలు చేసినట్లు చెప్పారు. ఆయా గ్రామాలలో మూడు లక్షల ఎకరాలకు గాను రెండు లక్షల ఎకరాలలో రీ సర్వే పూర్తయిందని, జిల్లాలో 142 గ్రామాలలో డ్రోన్ సర్వే పూర్తయిందని, రీ సర్వే పూర్త యిన 37 గ్రామాలలో 19,495 భూహక్కు పత్రాలు మంజూరైనట్లు చెప్పారు. అంగలూరులో 1260 ఎకరాల అగ్రహారం భూములు ఉన్నాయని, ఇనాం సర్వే అనంతరం ఫారం 5, ఫారం 8 రైతులకు అందజేసి సర్వే పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో 1930 రైస్ కార్డులు మంజూరయ్యాయని, నూతన కార్డుదారులకు జనవరి నుండి బియ్యం పంపిణీ చేయనున్నట్లు చెప్పారు .అలాగే, 61 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసే లక్ష్యంగా 67 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని , ఇప్పటి వరకు 300 మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల వద్ద నుండి కొనుగోలు చేసినట్లు వివరించారు. అనంతరం కొండముట్లలో రేషన్ షాప్‌ను నెంబర్ 18లో జేసీ తనిఖీ చేశారు. జేసీతో పాటు డిఎస్ఓ మోహన్‌బాబు, ఆర్డీవో శేషిరెడ్డి, మండల సర్వేయర్ పి.చండీరాణి, వీఆర్వోలు నాగ రాజు, పిచ్చయ్య ఉన్నారు.

రీ సర్వేకు రైతులు సహకరించాలి

ప్రజాశక్తి-రొంపిచర్ల

గ్రామాలలో జరిగే పొలాల రీ సర్వే కార్యక్రమానికి రైతులు సహకరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం మండలంలో జరిగిన రీ సర్వే పై సమీక్ష సమావేశం నిర్వ హించారు. జెసి మాట్లాడుతూ మండలం లోని దాసరిపాలెం, తురుమెళ్ళలలో పెం డింగ్ లో ఉన్న భూములకు సంబంధించి 9(2) నోటీసులు అందజేయాలని ఆదేశించారు. ముత్తనపల్లిలో ఫైనల్ రీ- సర్వే రికార్డు పూర్తయిందని, రీ సర్వే పూర్తయి భూహక్కు పత్రాలు వచ్చిన అన్నవరప్పాడు, నల్లగార్లపాడు, ఆరేపల్లి, అలవాలలో 2, 597 భూహక్కుపత్రాలను రైతులకు అందజేసి ఇ-కెవైసి వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. రీ సర్వే జరిగే గ్రామాలలో రైతులందరూ వారి పొలాల్లో జరిగే కొలతలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులు పొలాల హద్దుల దగ్గర ప్రభుత్వమే ఉచితంగా సర్వే రాళ్ళను పాతిస్తుందని చెప్పారు. రెవెన్యూ రికార్డుల్లో పేర్లు నమోదు కాని రైతులు సంబంధిత డాక్యుమెంట్లతో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - మాచవరం

పరీక్ష రాసే విద్యార్థుల కోసం శాసనమండలి సభ్యులు కె ఎస్ లక్ష్మణరావు రూపొందించిన ఎన్ఎంఎస్ స్టడీ మెటీరియల్‌ను గురువారం వేమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉచితంగా పంపిణీ చేశారు. మండలంలోని వేమవరం జడ్పీ హైస్కూల్లో ఎన్ఎం ఎంఎస్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ఉపాధ్యాయులు అందజేశారు. స్కాలర్ షిప్పులకు అర్హత సాధించాలని ఉపాధ్యాయులు కోరారు. ఈ సందర్భంగా కెఎస్ లక్ష్మణరావుకు ఉపాధ్యాయులు విద్యా ర్థుల తల్లిదండ్రులు తమ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శివబాబు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



వేమవరంలో విద్యార్థులకు మెటీరియల్ అందజేస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి, శ్రామిక మహిళ కమిటీ కేలండర్‌ల ఆవిష్కరణ





ప్రజాశక్తి, శ్రామిక మహిళ కమిటీ కేలండర్‌లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శివశంకర్ తదితరులు



సత్తెనపల్లిలో కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.వి.ఆంజనేయులు

ప్రజాశక్తి-నరసరావుపేట

ప్రజాశక్తి ప్రచురించిన నరసరావుపేట నియోజకవర్గం నూతన సంవత్సర కేలండర్‌ను జిల్లా కలెక్టర్ శివశంకర్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లోని ఎస్ ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ పత్రికా రంగంలో ప్రజాశక్తి దినపత్రిక నిత్యం పేద బడుగు బలహీన వర్గాల సమ స్యలను వెలుగులోకి తెస్తూ అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేస్తోందని కొనియాడారు. కార్యక్రమంలో సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, డివిజన్ ఇన్‌ఛార్జి ప్రేమ్ సాగర్, నరసరావుపేట, రొంపిచర్ల విలేకరులు పి.బుజ్జిబాబు వి. ఏడుకొండలు, నరసరావుపేట ప్రజాశక్తి దినపత్రిక ఏజెంట్ షేక్ సిలార్ మసూద్ తదితరులు పాల్గొన్నారు.

అదేవిధంగా శ్రామిక మహిళా జిల్లా కమిటీ (సిఐటియు) ప్రచురించిన కేలండర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. కేలండర్లఓ క్లాప్ వర్కర్లతో కలెక్టర్ ఉన్న ఫోటోలను ప్రచురించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఆశా వర్కర్లు, అంగన్వాడీలు, మహిళా కార్మికులు ఐక్యంగా సిఐటియు నీడన తమ హక్కుల సాధన కోసం ఐక్య పోరాటాలు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జి. నీరజకుమారి, కార్యదర్శి గుంటూరు మల్లేశ్వరి, శ్రామిక మహిళ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి, కృష్ణలీల, పద్మావతి, కవిత, నిర్మల, రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్

ప్రజాశక్తి 2023 నూతన కేలండర్‌ను తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే వై.వి.ఆంజనేయులు శుక్రవారం స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో ఆ పార్టీ శ్రేణులు మధ్య లాంఛనంగా ఆవి ష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రికా రంగంలో ప్రజల పక్షాన నిలబడి అవినీతి అక్రమాలపై విభిన్న కథనాలు రాస్తూ ప్రజలమన్ననలు పొందిన పత్రిక ప్రజాశక్తి అని అన్నారు. ప్రజాశక్తి క్యాలెండర్ ను తాను ఆవిష్కరించటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్ లో ప్రజాశక్తి మరింత అభివృద్ధి పథంలో ముందుకు పోయి పాలకుల అవి నీతి, అక్రమాలపై విభిన్న కథనాలు రాస్తూ పాఠకుల హృదయాల్లో చెరగని ముద్ర వేయా లని ఆకాంక్షించారు. అనం తరం కేలండర్‌తో పాటు డైరీని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చౌట శ్రీనివాసరావు, భీమినేని వందనాదేవి, పచ్చల నాగేశ్వరావు , గంగూరి వెంకట్రావు లతో పాటు ప్రజాశక్తి పల్నాడు డివిజన్ ఇంచార్జ్ ఎన్.కృష్ణ, పి.సి సెంటర్ ఇన్‌ఛార్జి, మునగా వెంకటేశ్వరరావు, విలేకరులు ఎ.నాగరాజు, ఎ.శివనాగేశ్వరావు పాల్గొన్నారు .

అన్ని శక్తుల్ని ఐక్యం చేసి బిజెపిని ఓడించాలి

సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు



విస్తృత సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు

ప్రజాశక్తి - మంగళగిరి

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని బిజెపికి వ్యతిరేకంగా అన్ని శక్తులను కలుపుకొని ఓడించాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. శుక్రవారం సాయంత్రం మంగళగిరి సిపిఎం కార్యాలయంలో సిపిఎం పట్టణ కమిటీ, పార్టీ సభ్యుల, సానుభూతిపరుల విస్తృత సమావేశం సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు వివి జవహర్లాల్ అధ్యక్షత నిర్వహించారు. రామారావు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతోన్మాద విధానాలను అవలంబిస్తుందని విమర్శించారు. ఇటీవల దేశంలో జరిగిన ఎన్నికల్లో బిజెపి ఓటమిపాలైందన్నారు. మూడు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో ఒక గుజరాత్ లోని బిజెపి గెలవడం జరిగిందన్నారు. గుజరాత్‌లో కూడా ముస్లిం, హిందువుల మధ్య వైషమ్యాలను రెచ్చగొట్టి , డబ్బుల బాగా ఖర్చు చేసి ఎన్నికల్లో గెలిచారన్నారు. దేశంలో ఉన్న బిజెపి వ్యతిరేక శక్తులన్నీ ఒక్కటై ఓడించడానికి సిపిఎం ప్రయత్నిస్తుందని అన్నారు. అందులో భాగంగానే బీహార్ లో బిజెపికి వ్యతిరేకంగా అన్ని రాజకీయ పార్టీలు ఒకటిగా నిలిచాయని అన్నారు. తెలంగాణలో కూడా బిజెపిని ఓడించడానికి బిజెపి వ్యతిరేక పార్టీలు ఒకటిగా నిలిచేందుకు ప్రయత్నిస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం చెత్త పై పన్ను వేసి ప్రజలకు భారాలు మోపుతుందని విమర్శించారు. మంగళగిరి పట్టణంలోని 500 పైగా పెన్షన్లు రద్దు చేశారని, పెన్షన్లు రద్దు చేయడం దారుణమన్నారు. వైసిపి ప్రభుత్వం వ్యతిరేకించే ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఎం పోరాటం చేస్తుందని అన్నారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎస్ చెంగయ్య, సిపిఎం సీనియర్ నాయకులు జె వి రాఘవులు, సిపిఎం పట్టణ కార్యదర్శి వై కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.



పెదనందిపాడులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

సామాజిక పింఛన్లు తొలగించొద్దు

ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి - పెదనందిపాడు

సామాజిక పెన్షన్లను అనర్హత పేరుతో ఏ ఒక్కరివీ తొలగించకుండా కొనసాగించాలని, పెండింగ్ పెన్షన్లు కూడా మంజూరు చేసి అర్హులందరికీ ఇవ్వాలని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పెదనందిపాడులోని విశ్రాంత ఉపాధ్యాయుల కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కురిసిన అధిక వర్షాలకు దెబ్బతిన్న మిర్చి, ప్రత్తి, శనగ పంట పొలాలను ఎన్యూమరేట్ చేసి నష్టపోయిన రైతులకు ఇన్ పుట్ సబ్సిడీ వెంటనే అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. శనగ పంట పీకివేసిన రైతులకు ఉచితంగా విత్తనాలు అందించాలని కోరారు. గుంటూరు ఛానల్ పొడిగింపునకు సంబంధించి ఇప్పటికే జిల్లా కలెక్టర్‌ను కలిశామని, భూమి సేకరణకు సంబంధించి గుంటూరు జిల్లా కలెక్టర్ వట్టి చెరుకూరు, ప్రత్తిపాడు, పెదనందిపాడు మండలాలకు నోటిఫికేషన్ ఇచ్చారని తెలిపారు. రెండు రోజుల క్రితం బాపట్ల జిల్లా కలెక్టర్ ను కలిసి నోటిఫికేషన్ ఇవ్వాలని కోరామని తెలిపారు. శుక్రవారం పర్చూరులో చానల్ పర్చూరు వరకు పొడిగించాలని, అందుకు అవసరమైన నిధులు రూ.113 కోట్లు వెంటనే విడుదల చేయాలని కోరుతూ రైతు సదస్సు నిర్వహించడం జరిగిందని తెలిపారు. బాపట్ల కలెక్టర్‌ను కలిసిన సందర్భంగా కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు తెలియజేశారు. విలేఖరుల సమావేశంలో జిల్లా సిఐటియు నాయకులు కాకుమాను నాగేశ్వరరావు, సిపిఎం పెదనందిపాడు మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు, చుక్కా యానాదులు, ముద్దన వెంకటేశ్వర్లు, జంపని రామారావు, కొత్తా శివనాగేశ్వరరావు లు పాల్గొన్నారు.

ఘొల్లుమంటున్న పింఛనుదారులు

- హౌస్ హోల్డ్ సర్వే తెచ్చిన తంటా
- నిబంధనలు ప్రకారం లేరని వేలాది మంది పింఛనుదారులకు నోటీసులు
- ప్రభుత్వ తప్పిదాలతో లబ్ధిదార్లకు అన్యాయం : సిపిఎం

ప్రజాశక్తి-గుంటూరు

ప్రభుత్వం ఇటీవల పింఛన్ల పున:పరిశీలన పేరుతో వేల మందికి పింఛన్లు నిలిపివేసింది. దీంతో సామాజిక పింఛన్‌పైనే ఆధారపడి జీవిస్తున్న వృద్ధులు, వితంతువులు, వికలాంగులు పింఛన్లు కోల్పోయి తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనేక మందికి అర్హత ఉన్నా సాంకేతిక సమస్యల వల్ల తొలగించటం గమనార్హం. ప్రభుత్వ తప్పిదంతో పింఛన్లు ఎగిరిపోయాయి. లబ్ధిదారులకు ఇచ్చే పింఛన్ మొత్తాన్ని పెంచినప్పుడల్లా పున:పరిశీలన పేరుతో అనేక మందికి రద్దు చేయటం పరిపాటిగా మారిందనే విమర్శలు వస్తున్నాయి. ఈ సారి ప్రధానంగా హౌస్ హోల్డ్ సర్వే ప్రామాణికంగా తీసుకొని పింఛనుదారులను ఏరివేత చేపట్టటంతో అర్హులకూ పింఛన్లు ఎగిరిపోతున్నాయి. సర్వే జరిగినప్పుడు ఒకే కుటుంబంగా మ్యాపింగ్ అయిన వారు, ఇప్పుడు వేర్వేరుగా ఉంటున్నా, పాత సర్వే ఆధారంగా ఒకే కుటుంబంలో ఉన్నందున ప్రభుత్వ నిబంధనలు వర్తింప చేసి, పింఛన్లు రద్దు చేశారు. ఈ విధంగా రద్దు అయినవి ఎక్కువగా ఉన్నాయని సిపిఎం నాయకులు విమర్శిస్తున్నారు. గత రెండు, మూడు రోజులుగా నగరంలో ఆ పార్టీ కార్యకర్తలు నగరంలో పింఛన్ కోల్పోయిన లబ్ధిదారులను కలుసుకొని మాట్లాడారు. అర్హత ఉన్నా పింఛన్ రద్దు చేశారని పలువురు బాధితులు నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. ప్రగతి నగర్‌కు చెందిన రాగి విశ్వరూపచారి (ఫించన్ నెం:107935877), పాత గుంటూరు శ్రీకృష్ణ నగర్‌కు చెందిన కుర్రా బసవమ్మ (ఫించన్ నెం:107666571), పంపు కోటేశ్వరరావు (ఫించన్ నెం:107139038)లు 20 సంవత్సరాల క్రితమే వారి పిల్లల పేరుతో ఇళ్లు వ్రాశారు. ఆయా స్థలాలు తర్వాత అనేక చేతులు మారింది. అయితే రిజిస్ట్రేషన్ లేకపోవటం వల్ల, నగరపాలక సంస్థ ఇంటి పన్ను పేర్లు మార్లు మార్చట్లేదు. మొదట యజమాని పేరే ఇప్పటికీ కొనసాగుతుంది. దీంతో వెయ్యి చదరపు అడుగులు స్థలంకి మించి ఉన్నదని నెపంతో పింఛన్లు రద్దు చేస్తామని ఆయా లబ్దిదారులకు నోటీసులు జారీ చేశారు. అలాగే విద్యుత్ అధికారులు అనేక మంది వినియోగదారుల ఆధార్ కార్డులను వారికి సంబంధం లేని సర్వీసు నంబర్లతో యాడ్ చేయటం వల్ల విద్యుత్ వినియోగం 300 యూనిట్లు దాటిందని పింఛన్లు ఎత్తివేశారు.

రెండు స్థలాలు కలిపి చూపించారు



దేరంగుల నాగేశ్వరరావు

స్థానిక 48వ డివిజన్, ప్రగతి నగర్‌కు చెందిన దేరంగుల నాగేశ్వరరావుకి (ఫించన్ నం:107850167) వృద్ధాప్య పింఛన్ వస్తుంది. నాగేశ్వరరావు, అతని కుమారుడు వేర్వేరుగా ఇళ్ళు, రేషన్ కార్డులు కలిగి ఉన్నారు. అయితే ప్రభుత్వ హౌస్హోల్డ్ సర్వేలో ఇద్దరి ఇంటి స్థలం కలిపి చూపటంతో వెయ్యి చదరపు అడుగులకు మించి ఉందని, నాగేశ్వరరావుకు పింఛన్ రద్దు చేశారు.

బధిర విద్యార్థినికి పింఛను రద్దు



దండు శిరీష

స్థానిక జాకీర్ హుస్సేన్ నగర్‌కు చెందిన మూగ, చెవిటి విద్యార్థి దండు శిరీష (ఫించన్ నెం:10763 1944) వికలాంగుల పెన్షన్ పొందుతుంది. వీరు, ఈమె తాతయ్య వేర్వేరు ఇళ్లలో, వేర్వేరు రేషన్ కార్డులు కలిగి ఉన్నారు. అయితే హౌస్ హెూల్డ్ మ్యాపింగ్‌లో కలిపి చూపటంతో 300 యూనిట్లకు మించి కరెంటు వాడుతున్నారనే పేరుతో పింఛన్ ఎత్తివేశారు.

ప్రభుత్వ తప్పిదం వల్లే పింఛనుదారులకు కష్టాలు

సిపిఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కె.నళినికాంత్

ప్రభుత్వ తప్పిదాల వల్లనే వేలాది మందికి పింఛన్లు నిలిచిపోయాయని సిపియం నగర కార్యదర్శి కె.నళినీకాంత్ విమర్శించారు. శుక్రవారం బ్రాడీపేటలోని సిపియం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుంటూరు నగరంలో 4161 మంది పింఛన్‌దారులను అనర్హత పేరుతో నోటీసులు ఇచ్చారని తెలిపారు. తమ వల్ల జరిగిన పొరపాట్లను సరిదిద్దుకోవాల్సిన ప్రభుత్వం, ముసలి వాళ్ళను వికలాంగుల్ని ఒంటరి మహిళల్ని ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిప్పుతూ ఇబ్బందులు పెడుతున్నదని విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఒక చేత్తో సంక్షేమ పథకాలు ఇస్తూ, మరో చేత్తో తొలగిస్తుందని విమర్శించారు. ఏ ప్రభుత్వం ఇవ్వనన్ని సంక్షేమ పథకాలు ఇస్తున్నానని గొప్పలు చెబుతున్న జగన్మోహన్ రెడ్డి, గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇచ్చే పథకాలను ఇంతలా రద్దు చేయలేదని కూడా గుర్తించాలని కోరారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయడానికి సచివాలయ వ్యవస్థ వాలంటీర్లు ఉన్నా ఈ తప్పిదాలను ఎందుకు సరి చేయలేకపోతున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వం తప్పిదాలను పొరపాట్లను గుర్తించి ఫించన్ దారులకు న్యాయం చేయాలని, లేని పక్షంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన పూనుకుంటావని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు కే శ్రీనివాస్ బి ముత్యాలరావు పాల్గొన్నారు.



డాక్టర్ శ్రీవాణిని అభినందిస్తున్న చైర్మన్ విద్యాసాగర్

వివిఐటి అధ్యాపకురాలు శ్రీవాణికి బెస్ట్ ఇన్నోవేషన్ అవార్డు

ప్రజాశక్తి - తెనాలి : వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగానికి చెందిన అధ్యాపకురాలు డాక్టర్ ఆళ్ళ శ్రీవాణి జేఎన్టీయూ కాకినాడ నిర్వహించిన ఇన్నోవేషన్ ఫెయిర్ 2022లో బెస్ట్ ఇన్నోవేషన్ అవార్డును దక్కించుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో ఆమెను వివిఐటి చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ అభినందించారు. తిన్ ఫిన్ ఫిల్మ్ ఆవిష్కరణ, పరిశోధన ఆవిష్కరణలకు గాను ఆమెకు అవార్డు లభించినట్లు ఆయన చెప్పారు. ఇన్నోవేషన్ ఫెయిర్‌లో మొత్తం 175 ఆవిష్కరణలు ప్రదర్శించగా అధ్యాపకుల విభాగంలో ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్ పరికరాల రక్షణలో ఉపయోగించే తిన్ ఫిల్మ్ అతి తక్కువ, అతి ఎక్కువ వోల్టేజ్ వద్ద, వోల్టేజ్ అప్ అండ్ డౌన్ పరిస్థితులలో అత్యధిక సామర్థ్యాలను కలిగి ఉండే తీరును ప్రదర్శనలో ఆమె వివరించినట్లు చెప్పారు. డాక్టర్ శ్రీవాణిని అభినందించిన వారిలో ప్రిన్సిపల్ డాక్టర్ వై మల్లికార్జున రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ వైవి ఎస్ ఎస్ వి ప్రసాదరావు, డీన్ ఆఫ్ అకాడమిక్స్ డాక్టర్ కే గిరిబాబు, డీన్ ఆఫ్ అడ్మిన్ డాక్టర్ ఎన్ కుమారస్వామి, డీన్ ఎం.వి రఘురాం ఉన్నారు.



కేలెండర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాసులురెడ్డి, వెంకటాచార్యులు

వాస్తవాల వార్తల సమాహారం ప్రజాశక్తి

కేలెండర్ ఆవిష్కరణలో తహశీల్దార్ శ్రీనివాసులురెడ్డి

ప్రజాశక్తి-తాడేపల్లి: నిత్యం వాస్తవాల వార్తల సమాహారాన్ని ప్రజల ముందుకు తెస్తున్న ప్రజాశక్తికి ప్రత్యేకఅభినందనలని తాడేపల్లి తహశీల్దార్ శ్రీనివాసులురెడ్డి అభినందించారు. 2023 ప్రజాశక్తి నూతన సంవత్సర కేలండర్‌ను ఆయనతో పాటు జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్టు నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రజాశక్తి దినపత్రికను తాను చదువుకునే రోజుల నుంచి అనుసరిస్తున్నట్లు చెప్పారు. సమాజంలో ఉన్న అట్టడుగు వర్గాలు, ఇతిహాసాలకు అక్షర రూపం కల్పిస్తున్న ప్రజాశక్తి అనూహ్యామైన కృషి దాగుందని చెప్పారు. ప్రత్యామ్నాయ జర్నలిజం ప్రజల్లోకి తీసుకెళ్తూ విశిష్ట ఒరవడిని సంతరించుకున్న ప్రజాశక్తి మున్ముందు మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో తాడేపల్లి మాజీ సర్పంచ్ దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, సిఐటియు నాయకులు వేముల దుర్గారావు, వెంకన్న, ఎంటిఎంసి బాలోత్సవం నిర్వాహకులు అంజిరెడ్డి, కోదండరామయ్య, ప్రజాశక్తి విలేకరి జి.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



యుటిఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - చేబ్రోలు :జీవోలతో కూడిన అద్యాపక దర్శిని యుటిఎఫ్ ప్రచురించిన డైరీ ఉపాధ్యాయులకు కరదీపికగా ఉందని చేబ్రోలు ఎంఇఒ తెలిపారు. శుక్రవారం మండల ఎంఇఒ కార్యాలయంలో యుటిఎఫ్ ప్రచురించిన క్యాలెండర్, డైరీని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ ఎల్ వి రమణ రావు, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం .శ్రీరామ్ మూర్తి జిల్లా కార్యదర్శి జి. వెంకటేశ్వరరావు,మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై రమేష్‌బాబు, డి నాగేశ్వరరావు, గౌరవాధ్యక్షులు ఐ శ్రీనివాసరెడ్డి, మహిళా సహాధ్యక్షులు కె పార్వతి, కోశాధికారి కె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఈనాం భూములకు మినహాయింపు ఇవ్వండి

ప్రజాశక్తి - యడ్లపాడు

వైఎస్సార్ జగనన్న శాశ్వత భూరక్ష-భూ హక్కు కార్యక్రమంలో ఈనాం భూముల సర్వేను నిలుపుదల చేయాలంటూ స్థానిక చెంఘీజ్‌ఖాన్‌పేట రైతులు రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. తాజాగా కొండవీడు రెవెన్యూ పరిధిలో రీసర్వే నిర్వహిస్తున్నట్లు గురువారం రాత్రి అధికారులు చెంఘీజ్‌ఖాన్ పేటలో గ్రామసభను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన ఈనాం రైతులు తమ భూముల విషయం కోర్టు పరిధిలో ఉన్నందున వాటిని సర్వేలో మినహాయింపు చేయాలంటూ కోరుతూ శుక్రవారం డీటీ ఎస్. శ్యామలతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతులు గడ్డం శ్రీనివాసరావు, కోటయ్య, నాగేశ్వరరావు, గ్రామపెద్దలు బసెల శివరామకృష్ణ, రాచమంటి చింతారావు, షేక్ షంషుజుహా ఉన్నారు.

168 నూతన పెన్షన్లు మంజూరు

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలోని 11 గ్రామాలకు గాను నూతనంగా 168 పెన్షన్లు మంజూరైనట్లు ఎంపీపీ దాసరి చౌడేశ్వరి తెలిపారు శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ జనవరి 2023 నుంచి ఇవి అమల్లోకి వస్తాయన్నారు గోలి గ్రామానికి 11 ,జెట్టిపాలెం 10, మల్లవరం 4 , మంచి కళ్ళు 15, మెట్టగుడిపాడు 8 ,పాలువాయి 16, పాల్వాయి గేటు 9 ,పసర్లపాడు 18, రెంటచింతల 45 ,రెంటాల 14, తుమ్మరకోట 18 , నూతనంగా జనవరి నుండి పెన్షన్లు ఇవ్వనున్నారు వీటితో కలుపుకొని పెన్షన్ పొందే వారి సంఖ్య 6781 మంది ప్రతినెల 1 కోటి 86 లక్షల 47 వేల 750 రూపాయలను ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు.



పాదయాత్రను అడ్డుకుంటామనడం తగదు

ప్రజాశక్తి-పెదకూరపాడు

లోకేష్ పాదయాత్ర జయప్రదం కావడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పెదకూరపాడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఆర్తిమల రమేష్ కోరారు.శుక్రవారం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ లోకేష్ పాదయాత్రను అడ్డుకుంటామని వైసిపి నాయకులు ప్రకటనలు చేయటం వారి అహంకారానికి నిదర్శనమని విమర్శించారు. అటువంటి చర్యలు చేపడితే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు.

బ్లాస్టింగ్‌లతో గ్రామస్తుల భయాందోళనలు

ప్రజాశక్తి-బెల్లంకొండ



మండలంలోని పాపాయిపాలెం గ్రామంలో యథేశ్చగా అక్రమ మైనింగ్ నిర్వహిస్తున్నారని, బ్లాస్టింగ్ సమయంలో పెద్ద పెద్ద శబ్దాలు వస్తుండటంతో భయభ్రాంతులకు గురవు తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయమై సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఇప్పటికైనా అధికారులు స్పందించి బ్లాస్టింగ్ నిర్వహించకుండా చూడాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యతోనే సమాజంలో మార్పు

బెల్లంకొండ పాఠశాలలో రూ.92 లక్షలతో నూతన గదులను ప్రారంభించిన ఎంపి శ్రీకృష్ణదేవరాయలు



నకరికల్లు జెడ్పి పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్ లు పంపిణీ చేస్తున్న ఎంపి శ్రీకృష్ణదేవరాయలు

ప్రజాశక్తి-బెల్లంకొండ

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.92 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన గదులను నర్సరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు,పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకకరావు, నియోజకవర్గ పరిశీలకులు పైలా సోమినాయుడు గురువారం ప్రారంభించారు. అనంతరం 8వ తరగతి విద్యార్థులకు ఎంపి చేతుల మీదుగా ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ విద్య ద్వారా మాత్రమే సమాజంలో మార్పు వస్తుందని, ఆర్థికంగా నిలదొక్కుకో గలుగుతారని అన్నారు. విద్యా వైద్య రం గాలకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా జగనన్న గోరుముద్ద, అమ్మఒడి పథకాల గురించి ప్రస్తావించారు. కార్యక్రమంలో ఎంపిపి సిహెచ్ పద్మ వెంకటేశ్వరరెడ్డి, మండల వైసిపి కన్వీనర్ ఒ. సాంబశివరావు, సొసైటీ బ్యాంక్ చైర్మన్ భద్రయ్య, కందిపాడు సర్పంచ్ పాప, వన్నాయపాలెం వైసిపి నాయకులు ఎం. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ట్యాబ్‌లు పంపిణి

ప్రజాశక్తి-నకరికల్లు

విద్యార్థులకు ప్రభుత్వం అందించే అవకాశాలను ఉపయోగించుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఎంపి శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. స్థానిక వంగా వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలలో విద్యార్థులకు ట్యాబ్‌లను శుక్రవారం పంపిణీ చేశారు. ముందుగా పాఠశాలలో రూ.10 లక్షల ఎంపి నిధులతో నిర్మించిన విద్యార్థుల డైనింగ్ హాల్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ విద్యార్థుల చదువు గురించి పాఠశాలలోని పేరెంట్స్ కమిటీ సమావేశాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ బి.రాఘవరెడ్డి, మండల ఉపాధ్యక్షులు, ఎం.ప్రవీణ్ కుమార్‌రెడ్డి, హుస్సేన్ బి బాషా, సర్పంచ్ పి. అంజమ్మ, వి. రాజారెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, ఎం.శీను, టి. వెంకటేశ్వర్లు, నారాయణ, ప్రధానోపాధ్యాయులు రంగాదేవి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - విజయపురి సౌత్

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు బైజుస్ కంటెంట్ తో కూడిన ట్యాబ్ లను మాచర్ల ఎంపిపి బూడిద శ్రీనివాసరావు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జ్ హెచ్ఎం ఆశాలత, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ధర్మవరపు సుబ్రహ్మణ్యం, తోటకూర పరమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక ఉర్దూ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ ట్యాబ్లను అందజేశారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులకు సి.ఇ.డి.ఎం వారి ఉచిత మెటీరియల్ అందజేశారు. మండల పరిధిలోని ఏనుగుపాలెం ఎంపియుపి పాఠశాలలో పిఎంసి చైర్మన్ అప్పిశెట్టి శ్రీలక్ష్మి అధ్యక్షతన 8వ తరగతి విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. 8వ తరగతిలో ఉన్న 20 మంది విద్యార్థులకు 20 ట్యాబులు, వాటి పౌచ్ లు, ఓటిజి కేబుల్స్ పంపిణీ చేశారు.



బెల్లంకొండలోని ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన గదులను ప్రారంభిస్తున్న ఎంపి. చిత్రంలో ఎమ్మెల్యే, తదితరులు

ప్రజాశక్తి-నరసరావుపేట

స్థానిక లింగంగుంట్లలోని శంకర భారతిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున చేసిన ట్యాబ్ లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అమరావతి

మండల పరిధి మునుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిది తరగతి విద్యార్థులకు 91 ట్యాబ్‌లను పంపిణి చేశారు.

గృహ నిర్మాణ శాఖపై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా



పట్టణ గ్రామీణ ప్రాంతాలలో స్టేజ్ వైజ్ కన్వర్షన్స్ వచ్చే బుధవారం నాటికి 40 శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి స్పెషలాఫీసర్లతో కలిసి మండల అధికారులతో, మున్సిపల్ కమిషనర్లతో గృహ నిర్మాణ శాఖపై సమీక్ష సమావేశం నిర్వహించారు.కలెక్టర్ మాట్లాడుతూ లే అవుట్ వైస్, వార్డ్ వైస్ స్టేజ్ కన్వర్షన్‌ను ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో పూర్తి చేయా లన్నారు. మున్సిపల్ కమిషనర్లు మండల అధికారులతో అసిస్టెంట్ ఇంజనీర్ల ద్వారా పనులు, ప్రధానమంత్రి గ్రామీణ ఆవాస్ యోజన రిజిస్ట్రేషన్ లను పూర్తి చేయడంతో పాటు జియో ట్యాగింగ్ లను సకాలంలో పూర్తి చేయాలన్నారు. గృహ నిర్మాణ శాఖ పిడి. వేణుగోపాల్, డ్వామా పిడి జోసఫ్ కుమార్, డిఆర్డిఏ పిడి బాలు నాయక్, సాంఘిక సంక్షేమ అధికారి ఓబుల్ నాయుడు, మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు అధికారి ఆంజనేయులు, డిపిఓ భాస్కర్ రెడ్డి, గ్రామ సచివాలయ అధికారి మహాలక్ష్మి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వసంత కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అరాచక ప్రభుత్వ ఓటమికి కౌంట్ డౌన్: మాజీ ఎమ్మెల్యే వైవి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

రాష్ట్రంలో అభివృద్ధి నిరోధక అరాచక ప్రభుత్వం ఓటమికి కౌంట్ డౌన్ మొదలైందని, ప్రజలు ప్రభుత్వంపై యుద్ధం చేయా ల్సిన సమయం ఆసన్నమైందని సత్తెనపల్లి మాజీ ఎమ్మెల్యే వైవి ఆంజనేయులు అన్నారు. స్థానిక ఎన్టీఆర్ భవన్ వద్ద యలమంచిలి ఫౌండేషన్, వైవి ఆంజనేయులు సౌజన్యంతో నిర్వ హిస్తున్న అన్న క్యాంటీన్ వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం ఓ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాలొన్న ఆంజనేయులు మాట్లాడుతూ సత్తెనపల్లి పార్టీ పెద్దల నిర్ణయం మేరకు ఎన్టీఆర్ భవన్ వద్ద అన్న క్యాంటిన్ ఏర్పాటు చేసుకొని వంద రోజులు విజయవంతంగా పూర్తి చేసుకున్నామన్నారు.



సొంత ఇంటిలో కార్యక్రమంలా ప్రతి రోజు తెలుగు తమ్ముళ్లు బాధ్యతగా పని చేయడం అబినంద నీయ మన్నారు. సత్తెనపల్లిలో అన్న క్యాంటీన్ ప్రారంభించేందుకు స్థానిక మున్సిపల్ కమిషనర్ , ఎంఆర్ఓలను అభ్యర్థించామని, వారి నుంచి ఎటువంటి స్పందనలేదని చెప్పారు. ఈ సందర్భంగా క్యాంటీన్ నిర్వహణకు కృషి చేసిన పలువురు కార్య కర్తలను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన ప్రజలతో కలిసి భోజనం చేశారు.

లోకేష్ పాదయాత్రను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - వినుకొండ: వినుకొండ పట్టణ తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు పి.వి. సురేష్ బాబు అధ్యక్షతన స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల నందమూరి తారక రామారావు విగ్రహానికి శుక్రవారం పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర టిడిపి బీసీ సెల్ అధికార ప్రతినిధి పోట్లూరు సైదారావు మాట్లాడుతూ. యువగళం' కార్యక్రమాన్ని చేపట్టి పెద్ద ఎత్తున యువతను సమీకరించి వారికి అండగా నిలబడేలా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. **మాచవరం:**టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జనవరి 27న తలపెట్టిన యువగళం



పాదయాత్రని విజయవంతం చేయాలని టిడిపి మండల కన్వీనర్ బి.వెంకటేశ్వర్లు అన్నారు. **బెల్లంకొండ:** తెలుగుదేశం పార్టీని అధికారం లోకి తీసుకురావడానికి ప్రజలు ఆసక్తిగా ఉన్నారని తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పిఎస్కే మస్తాన్ షరీఫ్ అన్నారు. స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. **నూజెండ్ల :**తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం అనే పేరుతో తలపెట్టిన పాదయాత్రను జయప్రదం చేయాలని మండల టిడిపి అధ్యక్షుడు మీసాల మురళి యాదవ్ కోరారు. నూజెండ్ల ఎన్టీఆర్ సెంటర్ లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు.

రేషన్ సరుకులు ఇంటింటికి ఇవ్వకుంటే చర్యలు

ప్రజాశక్తి - రెంటచింతల

ప్రతి ఇంటికి రేషన్ బియ్యం సరుకులు ఇవ్వకుంటే చర్యలు తప్పవని తాసిల్దారు కే పుల్లారావు హెచ్చరించారు శుక్రవారం తాసిల్దార్ కార్యాలయంలో 37 మంది రేషన్ డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనవరి ఒకటో తేదీన సరుకులు పంపిణీ ఉదయం 7 గంటల నుంచి ప్రారంభించి రోజుకు 150 కార్డుల వరకు ఇంటింటికి తిరిగి ఇవ్వాలన్నారు జనవరి ఒకటో తేదీ నుంచి పంచదార కందిపప్పు వంటి నిత్యవసర సరుకులు కార్డుదారులకు అందుబాటులోకి వస్తా యన్నారు ఈ సమావేశంలో సివిల్ సప్లై డిటి మురళి ,ఆర్ఐ కాంతారావు ,రాజారావు ,వీఆర్వో రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రక్షిత మంచినీటి పథకాలకు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-నకరికల్లు

నకరికల్లు, దేచవరం గ్రామాలలోని రక్షిత మంచినీటి పథకాలకు విద్యుత్ సరఫరా నిలిపివేసినట్లు విద్యుత్ శాఖ ఏఈ డానియల్ శుక్రవారం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకరికల్లు రక్షిత మంచినీటి పథకానికి రెండు మీటర్లకుగాను ఒకదానిపై రూ.48,20,956, రెండవ దానిపై రూ.64,81,606 బకాయిలు ఉన్నట్లు తెలిపారు. దేచవరం గ్రామానికి సంబంధించి రూ.25,65,926 బకాయి ఉందన్నారు. గత మూడు నెలల నుండి బిల్లులు చెల్లించకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్వీ సులను తొలగించినట్లు ఏ ఈ తెలిపారు.

భట్రాజుల ఆత్మగౌరవం కాపాడిన జిఒ

ప్రజాశక్తి-రొంపిచర్ల

రాష్ట్ర ప్రభుత్వం భట్రాజు కుల ఆత్మగౌరవము పెంపొందించుకునే జిఓ జారీ చేసిందంటూ ముఖ్య మంత్రి జగన్ కు భట్రాజు సంఘం మండల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. మండల కేంద్రమైన రొంపిచర్లలో శుక్రవారం ఎపి భట్రాజు సంఘం మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఎపి భట్రాజు సంఘం రాష్ట్ర కార్యదర్శి సరికొండ తిమ్మరాజు మాట్లాడుతూ ఈ జిఓ ప్రకారం భట్రాజు పొగడ్త అనే పదం ఎవరూ వాడరాదని అన్నారు.

కార్మికుల్ని ఆపితే ఆందోళన ఉధృతం : సిపిఎం

ప్రజాశక్తి - మంగళగిరి : రాజధాని ప్రాంత పారిశుధ్య కార్మికులను జనవరి ఒకటో తేదీ నుండి పనిలో కొనసాగించాలని, లేనిచో ఆందోళన తీవ్రతరం చేస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజధాని ప్రాంతంలోని 29 గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు 400 మంది కార్మికులను వివిధ ఏజెన్సీల ద్వారా పనిలోకి 2017లో తీసుకొని పనిచేస్తున్నారని అన్నారు. కరోనా కష్టకాలంలో సైతం ప్రాణాలకు తెగించి పనిచేశారని అన్నారు. ప్రస్తుతం సుమిత్ ఏజెన్సీ జనవరి ఒకటి నుండి ప్రభుత్వం నిధులు కేటాయించనందున పనులు లేవని కార్మికులు ప్రత్యామ్నాయ పనులు చూసుకోవాలని చెప్పినట్లుగా తెలుస్తుందని అన్నారు. రాజధాని ప్రాంతంలో భూములు అన్ని రాజధాని అవసరాలకు రైతులు ప్రభుత్వానికి ఇచ్చారని ఈ నేపథ్యంలో ఆ గ్రామాల్లో వ్యవసాయ పనులు కూడా లేవని అన్నారు. ఏజెన్సీలకు నిధులు కేటాయించి కార్మికులకు పని కల్పించాలని లేకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. పని భద్రత కోసం కార్మికులను అవుట్సోర్సింగ్, కార్పొరేషన్ లోకి తీసుకోవాలని కోరారు.

పారిశుధ్య కార్మికులకు పని భద్రత కల్పించాలి

ప్రజాశక్తి-తాడేపల్లి

రాజధానిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు పని భద్రత కల్పించాలని రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘాల గౌరవాధ్యక్షులు ఎం.రవి కోరారు. శుక్రవారం ఉండవల్లిలో పని విరామ సమయంలో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ముందుగా దళితవాడలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ సిఆర్‌డిఎ 29 గ్రామాల్లో శానిటేషన్ కాంట్రాక్టు పొడిగించాలని డిమండ్ చేశారు. కరోనా హెచ్చరికల నేథ్యంలో రాజధాని గ్రామాల్లో పారిశుధ్య కార్మికులను తొలగించకుండా కొనసాగించాలని కోరారు. ఉద్యోగుల పేరుతో పారిశుధ్య కార్మికులకు రాజధాని సామాజిక పింఛను నిలిపివేశారని, వెంటనే పునరుద్ధరించాలని కోరారు. కొత్త సంవత్సరం జనవరి నుంచి పారిశుధ్య



కార్మికులను తొలగించాలని చూడటం సరికాదన్నారు. కార్మికులను తొలగించాలని చూస్తే విశాల మద్దతు కూడగట్టి పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు వల్లభాపురం వెంకటేశ్వరరావు, ఎస్ ఇమ్మాను యేలురాజు, బురదగుంట కోటేశ్వరరావు, కుషీలరావు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు జీవన నైపుణ్యాలు నేర్పించాలి

వ్యక్తిత్వ వికాస నిపుణులు శ్రావణ్ వారణాసి

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న శ్రావణ్

ఆకలిగా ఉన్నప్పుడు అన్నం పెట్టేవాళ్లు, విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు ఎల్లప్పుడూ కృతజ్ఞతగా ఉండాలని గుంటూరు ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి అన్నారు. భాష్యం మెడెక్స్, బైపిసి విద్యార్థులకు ఛాంపియన్ మైండ్‌సెట్ ఎలా ఉండాలి అనే అంశంపై ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు శ్రావణ్ వారణాసి శుక్రవారం వెంకటేశ్వరా విజ్ఞాన మందిరంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ ప్రభావతి మాట్లాడుతూ రోగుల ప్రాణాలు కాపాడే క్రమంలో ప్రతి సెకండ్ అత్యంత విలువైనదని కాబోయే డాక్టర్లుగా గుర్తుంచుకోవాలన్నారు. విద్యార్థులు ఒకసారి చదివిన సబ్జెక్టును తిరిగి మననం చేసుకోవాలని, తర్వాత బృంద చర్చల ద్వారా విజ్ఞానాన్ని ఒకరికొకరు పంచుకోవాలని, అప్పుడే బాగా జ్ఞాపకం ఉంటుందన్నారు. ఆర్ఐఒ సునీత మాట్లాడుతూ మన ఆలోచనా విధానాన్ని బట్టే మన జీవితం ఆధారపడి ఉంటుందన్నారు. వ్యక్తిత్వ వికాస నిపుణులు శ్రావణ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తనలోని భయాలను విడనాడాలని, అప్పుడే ధైర్యం వస్తుందన్నారు. తమపై తమకు నమ్మకం ఉంచుకోవాలన్నారు. అనంతరం తల్లిదండ్రులకు పాజిటివ్ పేరెంటింగ్ పేరుతో కౌమార దశలో ఉన్న పిల్లల్ని ఎలా పెంచాలి అనే అంశంపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో భాష్యం ఛైర్మన్ భాష్యం రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలి

ప్రజాశక్తి-తెనాలి: రాష్ట్ర ప్రభుత్వ పింఛను దారులు ఫిబ్రవరి 28లోగా లైఫ్ సర్టిఫికేట్లు సమర్పించాలని పెన్షనర్స్ అసోసియే షన్ తెనాలి శాఖ అధ్యక్ష కార్యదర్శులు మాచి రాజు రామకృష్ణమూర్తి, బొమ్మదేవరవ వెంకటేశ్వ రరావు శుక్రవారం తెలిపారు. అసోసి యేషన్ కార్యాలయంలో లైఫ్ సర్టిఫికేట్లు సమర్పించే అవకాశం కల్పించామని, ప్రతి రోజు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, అలాగే సాయంత్రం 2 గంటల నుంచి 5 గంటల వరకూ సర్టిఫికేట్ల స్వీకరణకు సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. పింఛనర్లు తమ ఆధార్ కార్డు, పిపిఒ నంబర్లు సీఎఫ్ ఎంఎస్ ఐడి, సెల్‌ఫోను తీసుకుని కార్యాల యానికి రావాలని, ఈ అవకాశాన్ని ఫించను దారులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

జిటిఎస్ నిర్మాణం వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ (జి.టి.ఎస్.) నిర్మాణ పనులు వేగంగా జరగాలని, ఇంజినీరింగ్ అధికారులు పనుల పురోగతిపై రోజువారీ నివేదిక ఇవ్వాలని నగర కమిషనరు కీర్తి చేకూరి ఆదేశించారు. శుక్రవారం కమిషనరు సంపత్ నగర్‌లోని కొబ్బరితోటలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న జి.టి.ఎస్. నిర్మాణ పనులు, పార్వతీపురం, ఎల్.ఆర్.కాలనీల్లో నిర్మాణం చేసిన సి.సి. డ్రైన్లను పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల ఏర్పాటు వలన నగరంలో సేకరించే వ్యర్థాలను సాంకేతిక విధానంలో సమర్ధవంతంగా నిర్వహణ చేయడానికి వీలు కల్గుతుందన్నారు. జిటిఎస్ నిర్మాణ పనులకు శుక్రవారమే మార్కింగ్ ఇచ్చి పనులను వెంటనే ప్రారంభించాలని కాంట్రాక్టర్‌ని ఆదేశించారు. జిటిఎస్‌కు వచ్చే రోడ్ ఏర్పాటు కూడా వెంటనే చేయాలన్నారు. పర్యటనలో ఎస్.ఈ. భాస్కర్, ఈ.ఈ.లు సుందర్రామిరెడ్డి, కొండారెడ్డి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే పనులు వేగవంతం చేయాలి..

గుంటూరు నగరంలో జరుగుతున్న రీ సర్వే వేగవంతం చేయాలని, వచ్చే నెల 3 నాటికి సచివాలయాల వారీగా 25 శాతం సర్వే పూర్తి కావాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. శుక్రవారం రెవెన్యూ కళ్యాణ మండపంలో పట్టణ ప్రణాళిక అధికారులు, వార్డు సచివాలయం ప్లానింగ్, రెవెన్యూ కార్యదర్శులతో సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత సమీక్షా సమావేశానికి కార్యదర్శులు సకాలంలో హాజరు కాకపోవడం గమనించి, ఉద్యోగులకు క్రమశిక్షణ అతి ముఖ్యమైనదని, పలు మార్లు సమావేశానికి సకాలంలో రావాలని సమాచారం ఇచ్చినా ఆలస్యంగా రావడం క్రమశిక్షణారాహిత్యంగా పరిగణలోకి తీసుకొని తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రీ సర్వే పై సమీక్ష చేసి, ఆశించిన స్థాయిలో సర్వే జరగడంలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రెవెన్యూ కార్యదర్శులతో మాట్లాడారు. సమావేశంలో సిటీ ప్లానర్ మూర్తి, డిప్యూటీ సిటి ప్లానర్ కోటయ్య, ఏ.సి.పి.లు కాలేష, బాబురావు పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌నకు హాజరైన ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాయపాటి గోపాలకృష్ణ, అధ్యాపకులు

సైబర్ నేరాలపై ఆర్‌విఆర్ అండ్ జెసిలో వర్క్‌షాప్

ప్రజాశక్తి-గుంటూరు : విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సాంకేతిక పరిజ్ఞానంతో వాటిని ఛేదించే స్థాయికి చేరాలని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు రాయపాటి శ్రీనివాస్ సూచించారు. సైబర్ నేరాల నియంత్రణపై శుక్రవారం కళాశాలలో విద్యార్థులకు సోషల్ మీడియా ఇంటెలిజెన్స్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. వర్క్‌షాప్‌లో సిఆర్‌సిఐడిఎఫ్ డైరెక్టర్ ప్రసాద్ పాటిబండ్ల ముఖ్య అతిథిగా పాల్గొని సైబర్ నేరాలు, వాటి నుండి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానం పెరిగిపోయి, ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి వచ్చిందని, ప్రతి ఒక్కరూ అవసరమైన సమాచారాన్ని మాత్రమే వినియోగించుకో వాలన్నారు. ఫేస్‌బుక్, ట్విట్టర్, వాట్సాప్‌ల ద్వారా మన వ్యక్తిగత సమచారం యాప్‌లు వినియోగానికి ముందు అనుమతులు ఇవ్వటం జరుగుతుందని, తద్వారా మన వ్యక్తిగత సమాచారం మొత్తం సైబర్ నేరస్తుల హ్యాక్ చేసే అవకాశాలు ఉన్నందున జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు మిల్లర్లు సహకరించాలి : జెసి

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : ధాన్యం సేకరణకు మిల్లర్లు సహకరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. ఖరీఫ్‌లో సేకరించిన ధాన్యానికి సంబంధించి స్టేట్ వేర్ హౌసింగ్ గోడౌన్‌కు మిల్లర్లు బియ్యం అందించిన కార్యక్రమంలో శుక్రవారం ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా రీజనల్ వేర్ హౌసింగ్ గోడౌన్స్ మేనేజర్ ఆర్ వీరయ్య స్వాగతించారు. కార్యక్రమంలో జేసి మాట్లాడుతూ ఖరీఫ్ 2022-23కు సంబంధించి ఇప్పటి వరకూ దాదాపుగా జిల్లాలో 5వేట టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు చెప్పారు. వాటిని రైస్ మిల్లర్స్‌కు తరలించగా, క్వింటాల్ ధాన్యానికి 67 కిలోల చొప్పున బియ్యం అందించారన్నారు. కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లయిస్ మేనేజర్ జి.లక్ష్మి, తెనాలి వేర్ హౌసింగ్ గోడౌన్స్ మేనేజర్ ఎం.శ్రీనివాసరావు, ఆర్‌ఎం అసోసియేషన్ అధ్యక్షులు బి.వెంకయ్య చౌదరి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ఆళ్ల శంకుస్థాపన

ప్రజాశక్తి-తాడేపల్లి: తాడేపల్లిలో పట్టణంలోని నులకపేటలో స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వెంటనే పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఎంఎల్ రామయ్య కాలనీ నిర్మాణం జరిగినప్పటి నుంచి సమస్యల పరిష్కారానికి సిపిఎం సుదీర్ఘ పోరాటాలు నిర్వహించింది. అందులో భాగంగానే భాగంగానే ఎమ్మెల్యే శుక్రవారం స్థానికంగా పర్యటించి పలు అంతర్గత రోడ్లను నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. 1.6 కిలోమీటర్ల పొడవున్న గ్రావెల్ రోడ్డును సుమారు రూ.20 లక్షలతో ప్రారంభించినట్లు ఎమ్మెల్యే చెప్పారు. స్థానికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను సిపిఎం నాయకులు వేముల దుర్గారావు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ కన్వీనర్ బుర్రముక్కు వేణుగోపాలసోమిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.డేవిడ్ రాజు, డిఇ కృష్ణారెడ్డి, ఎఇలు కిషోర్‌రెడ్డి, ప్రవీణ్ పాల్గొన్నారు.

గోదామ్మవారికి సారె సమర్పణ

ప్రజాశక్తి-తాడేపల్లి : సీతానగరం ఇంద్రకీలాద్రిపై ఉన్న గోదామ్మ వారికి విజయవాడలోని సత్యనారాయణపురం, భవానీపురం, వినుకొండ ప్రాంతాల నుంచి తరలివచ్చి శుక్రవారం సారె సమర్పించారు. ఆలయ నిర్వాహకులు వారికి ఘన స్వాగతం పలికారు.

కాపు కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన జ్ఞానదివ్య

ప్రజాశక్తి-తాడేపల్లి ఇటీవల న్యూజిలాండ్‌లో జరిగిన కామన్వెల్త్ పోటీల్లో పవర్ లిఫ్టింగ్ విభాగంలో బంగారు పతకంతో పాటు నాలుగు పతకాలు సాధించిన తెనాలి మండలం కటేవరం గ్రామానికి చెందిన నాదం జ్ఞానదివ్య శుక్రవారం తాడేపల్లిలోని కాపు కార్పొరేషన్ కార్యాలయంలో చైర్మన్ అడపా శేషగిరిరావును కలిశారు. ఈ సందర్భంగా జ్ఞానదివ్యను శాలువాతో సత్కరించారు.

పాదయాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-తాడేపల్లి: టిడిపి జీతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జనవరి నెలలో కుప్పం-విశాఖకు చేపట్టనున్న యువగళం పాదయాత్రను జయప్రదం చేయాలని టిడిపి తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు కోరారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలు తెలుసుకోవడయే లక్ష్యంగా యువగళం పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. 400 రోజులు 4 వేల కిలోమీటర్లు సాగే పాయయాత్ర ద్వారా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామని చెప్పారు. సమావేశంలో దానబోయిన సుందర రావుయాదవ్, బి.రామకృష్ణ, ఇట్టా భాస్కర్, కెటివి ప్రసాద్, ఎం.గోపాలరావు, సిహెచ్.శివుడు, సింహాచలం పాల్గొన్నారు.

30 మందికి బ్యూటిఫికేషన్ కోర్సు సర్టిఫికెట్లు

ప్రజాశక్తి - మంగళగిరి : మంగళగిరి నియోజకవర్గం టిడిపి కార్యాలయంలో శ్రీ శక్తి కార్యక్రమంలో భాగంగా బ్యూటిఫికేషన్ కోర్సుల్లో శిక్షణ పూర్తయిన 30 మందికి బ్యూటిఫికేషన్ కిట్లు, చైర్స్, సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలుగు మహిళ నాయకురాలు ఆరుద్రపు లక్ష్మి, టి జానకి దేవి, ఏం వైష్ణవి, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలలో ఆకస్మిక తనిఖీ

పొన్నూరు - ప్రజాశక్తి రూరల్ : ప్రభుత్వం ప్రవేశపెట్టిన సచివాలయాల పని తీరును వాటి విధి విధానాలపై తెనాలి డివిజనల్ లెవెల్ డెవలప్మెంట్ ఆఫీసర్ కే.పద్మావతి శుక్రవారం పొన్నూరు మండలంలోని చింతలపూడి కసుక్రరు, మాచవరం, గ్రామ సచివాలయలను ఆకస్మికంగా తనిఖీ చేసి, సిబ్బందిని వివరాలు అడిగారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేషమాంబ, పంచాయతీ సెక్రెటరీ షేక్.మహబూబ్ సుభాని సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నైపుణ్యాలను పెంపొందించుకోండి

ప్రజాశక్తి - తుళ్లూరు : ప్రస్తుత పోటీ ప్రపంచంలో నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని రాంకీ ఫౌండేషన్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఫౌండర్, రాజ్యసభ సభ్యులు ఆళ్ళ అయోధ్య రామిరెడ్డి అన్నారు.మండలంలోని పెదపరిమి గ్రామంలో ముప్వా చిన బాపిరెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పోలీస్ ఫ్రీ రిక్రూట్ మెంట్ ట్రైనింగ్ సెంటర్ కు అయోధ్య రామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోలీస్ ఉద్యోగానికి శిక్షణ ఇప్పిస్తున్న రాంకీ ఫౌండేషన్ ప్రెసిడెంట్ ఎం వి రామిరెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో మధుకర్,సతీష్ పాల్గొన్నారు.



ముప్వా వెంకట్రావుకు నివాళి

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

రైతు, కార్మికుల సమస్యల పై తుది శ్వాస విడిచే వరకు పోరాడిన యోధుడు ముప్వా వెంట్రావు అని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దండా లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం ముప్వా వెంకట్రావు సంస్మరణ సభ సిఐటియు నాయకులు బి ప్రభుదాసు అధ్యక్షతన పొన్నూరు సిఐటియు కార్యాలయంలో నిర్వహంచారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతు సామాజిక అణిచివేత, ముడనమ్మకాలకు వ్యతిరేకంగా ప్రచారం చేసిన వ్యక్తి అని అన్నారు. ప్రజాశక్తి పత్రికను ప్రజల దగ్గరికి తీసుకెళ్లే దానిలో ఆయన కృషి మరువలేనిదన్నారు. ముందుగా వెంకట్రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాగబ్రహ్మాచారి, రమేష్, ఆంటోనీ సెల్వరాజ్ పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీలో తుంటి మార్పిడి శస్త్రచికిత్సలు

సాయిభాస్కర్ ఆస్పత్రి అధినేత డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

లక్షల రూపాయల ఖర్చుతో కూడుకున్న తుంటి మార్పిడి శస్త్ర చికిత్సలను రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ వైయస్సార్ ఆరోగ్యశ్రీ కిందకు తీసుకురావడం శుభ పరిణామం అని సీనియర్ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్, సాయి భాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ బుసిరెడ్డి నరేంద్రరెడ్డి తెలిపారు. బాపట్ల నందిరాజు తోటకు చెందిన జంపని పద్మావతికి, గుంటూరు బ్రాడీపేటకు చెందిన చంద్రశేఖర్ కు నిర్వహించిన తుంటి మార్పిడి ఆపరేషన్లు ఇటీవల నిర్వహించామన్నారు. సామాజిక బాధ్యతగా తీసుకొని ఆరోగ్యశ్రీ కింద శస్త్ర చికిత్సలు ప్రారంభించినట్లు తెలిపారు. ఒకసారి తుంటి మార్పిడిఆపరేషన్ నిర్వహిస్తే 25 నుంచి 30 సంవత్సరాల పాటు ఎటువంటి ఇబ్బంది లేకుండా నడవగలుగుతారని చెప్పారు. విలేకరుల సమావేశంలో వైద్యులు మర్రెడ్డి శివారెడ్డి, కొనగండ్ల శ్రీనివాస్, యరగూటి సాంబశివారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాపారావు

5న సర్పంచ్‌ల సంఘం విస్తృత సమావేశం

ప్రజాశక్తి-గుంటూరు

సర్పంచ్‌లు హక్కుల సాధన కోసం రాబోయే కాలంలో కలిసికట్టుగా ఉండాలని సర్పంచ్‌ల సంఘం ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు చిలకలపూడి పాపారావు అన్నారు. జనవరి 5న తాడేపల్లి సిఎస్‌ఆర్ కళ్యాణ మండపంలో జరిగే రాష్ట్ర విస్తృత కార్యవర్గ సమావేశంలో సర్పంచ్‌లు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. శుక్రవారం గుంటూరు బ్రాడీపేటలోని, గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆరుదల సాంబశివరావు అధ్యక్షతన జరిగిన జిల్లా విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్పంచ్‌ల గౌరవ వేతనం రూ.3వేల నుండి రూ.15 వేలకు పెంచాలని, గ్రీన్ అంబాసిడర్ల జీతాలు రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని, పంచాయతీల అధీనంలోనే గ్రామ సచివాలయాల కార్యకలాపాలు జరగాలని, 15వ ఆర్థిక సంఘం నిధులు పిఎంఎఫ్ఎస్ లింకేజ్ ఉన్న కొత్త బ్యాంకు ఖాతాల్లోనే కేంద్రం జమ చేయాలని తదితర ప్రధాన డిమాండ్లపై రాష్ట్ర సమావేశంలో చర్చించి, భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకుంటామని వివరించారు. నూతన కార్యవర్గం ఎన్నుకుంటామని చెప్పారు. రాజేంద్రప్రసాద్ అనే వ్యక్తి చీకటి గదిలో ఏర్పాటు చేసిన సర్పంచ్‌ల కార్యవర్గాన్ని తాము అంగీకరించబోమన్నారు. రాజేంద్రప్రసాద్ సర్పంచ్ కాదన్నారు. రాష్ట్రంలో 13 వేల మంది సర్పంచ్‌లు ఉన్నారని, సర్పంచ్‌ల సంఘాన్ని సర్పంచ్‌లే ఎన్నుకుంటారని స్పష్టం చేశారు. అఖిల భారత పంచాయితీ పరిషత్ కార్యదర్శి జాస్తి వీరాంజనేయులు మాట్లాడుతూ విద్యుత్ బకాయిలు గ్రామ పంచాయతీలకు గుదిబండగా మారాయన్నారు. జమ్మూ కాశ్మీర్‌లో కేంద్రం సోలార్ విద్యుత్ ద్వారా, ప్రజలందరికీ ఉచితంగా విద్యుత్‌ను అందిస్తుందని, అదే విధంగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా అన్ని పంచాయతీల్లో సోలార్ విద్యుత్ అందించటానికి ఏర్పాట్లు చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా నాయకులు పి.నాగమణి, డబ్బారి సూర్యప్రకాశరావు, మనోహర్ పాల్గొన్నారు.

ఒంటికాలిపై చేతులెత్తి మొక్కి..

హామీల అమలు కోసం 108 ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-గుంటూరు



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా భావించే 108 అంబులెన్స్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు గతంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని జిల్లాలో పలు చోట్ల ఒంటికాలిపై నిలుచొని, రెండు చేతులూ జోడించి నమస్కరించారు. ఆయా ఫోటోలను, విజ్ఞాపన పత్రాన్ని సిఎంకు ఈ-మెయిల్ చేశారు. 108 ఉద్యోగుల 2020 జులై నుండి పెంచి, నిర్వహణ సంస్థ అయిన అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ ద్వారా చెల్లించినా, 24 గంటలకూ ప్రజలకు ఉచిత అత్యవసర సేవలు అందిస్తున్నా ఇఎంటి పైలెట్‌లకు ప్రతినెలా జీతాల చెల్లింపులో తీవ్ర జాప్యమవుతోందని నాయకులు వాపోయారు. ఎప్పుడు ఉద్యోగం ఉంటుందో, ఎప్పుడు ఉండదో అర్థం కాక, ఆందోళనలో ఉన్నామన్నారు. చిన్న చిన్న కారణాలకూ సరైన విచారణ లేకుండా డివిజన్ ట్రాన్స్‌ఫర్, డిస్ట్రిక్ట్ ట్రాన్స్‌ఫర్, సస్పెన్షన్, టెర్మినేషన్ వంటి నిర్ణయాలు తీసుకుంటూ అనేక మందిని ఇప్పటికే యాజమాన్యం విధులకు దూరం చేసిందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో జీతం పెరిగిందనే సంతోషం కంటే ఉద్యోగం ఎప్పుడు ఊడుతుందో అనే బాధతోనే ఉద్యోగం చేయాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. ఇఎంటి పైలెట్‌లను ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించి, ఇఎంటిలకు రూ.30 వేలు, పైలెట్‌లకు రూ.28 వేలు చెల్లించాలని, ప్రతి నెలా 5వ తేదీలోగా క్రమం తప్పకుండా వేతనాలు జమ చేయాలని, ఎఇఎంఎస్ సంస్థ నిలిపివేసిన ఉద్యోగులందర్నీ తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, తదితర డిమాండ్లతో కూడిన విజ్ఞాపన పత్రాన్ని సిఎంకు మెయిల్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు బి.కిరణ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.మహేష్, ప్రధాన కార్యదర్శి కెవివి నరసింహారావు, ట్రెజరర్ ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎన్నికలపై వైపు పార్టీల చూపు!

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 2022లో రాజకీయంగా అనేకమార్పులు చోటుచేసుకున్నాయి. వైసిపి అధికారంలోకి వచ్చి మూడున్నరేళ్లు పూర్తి కావడంతో ప్రభుత్వంపై వస్తున్న ప్రజా వ్యతిరేకతపై ప్రతిపక్షాలు ఉద్యమాల ద్వారా ప్రజలకు చేరువకావడానికి ప్రయత్నిస్తున్నాయి. సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకు వైసిపి ప్రజా ప్రతినిధులు ఆరునెలలుగా గడపగడపకు ప్రభుత్వం పేరుతో ఇంటింటికీ వెళ్తున్నారు. వివిధ అంశాలపై ఆందోళన రూపంలో టిడిపి, వామపక్షాలు, జనసేన, బిజెపి, కాంగ్రెస్ వారి స్థాయిలో ఆందోళనలను నిర్వహించాయి. రానున్న ఏడాది చివరిలో ముందస్తుగా అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశం ఉందని రాజకీయ పక్షాల్లో ప్రచారం నేపథ్యంలో ఏడాది ముందే ఎన్నికల వేడి రాజుకుంటోంది. పల్నాడులో టిడిపి, వైసిపి ఢీ అంటే ఢీ అనే స్థాయిలో ఘర్షణలు జరుగుతున్నాయి.

కొనసాగుతున్న గడపగడపకు మన ప్రభుత్వం

టిడిపి 'బాదుడే బాదుడు.. ఇందేం ఖర్మ..'

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై వామపక్షాల పోరాటం

2022 రాజకీయ ముఖచిత్రం



రాజకీయ రంగం

ఉమ్మడి జిల్లాల్లోని వేర్వేరు ప్రాంతాల్లో పర్యటించారు.

ప్రతిపక్ష పార్టీల్లో స్వల్ప మార్పులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

అధికార వైసిపిలో ఈ ఏడాది పలు మార్పులు జరిగాయి. హోంమంత్రిగా ఉన్న మేకతోటి సుచరిత తనపదవికి రాజీనామా చేశారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన మంత్రి వర్గ విస్తరణలో ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి నూతన మంత్రులుగా అంబటి రాంబాబు, విడదల రజనీ, మేరుగ నాగార్జున ప్రమాణ స్వీకారం చేశారు. రాజకీయ కాలపరిమితి ముగియడంతో డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి కూడా తన పదవికి రాజీనామా చేశారు. ఎమ్మెల్సీలుగా ఉన్న డొక్కా మాణిక్య వరప్రసాద్, జంగా కృష్ణమూర్తి మండలిలో ప్రభుత్వ విప్‌లుగా నియమితులయ్యారు. మంత్రి పదవి కోల్పోయిన సుచరితకు పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించినా కొద్దినెలలకు ఆమెను ఈ పదవిని కూడా తప్పించి ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవర ప్రసాద్‌కు జిల్లా అధ్యక్ష పదవిని కేటాయించారు.

మాణిక్యవర ప్రసాద్‌ను తొలుత తాడికొండ నియోజకవర్గం అదనపు సమన్వయకర్తగా నియమించగా రెండు నెలలకే ఈ పదవి నుంచి తప్పించారు. తాడికొండ అదనపు సమన్వయకర్తగా కత్తెర సురేష్‌కుమార్‌ను నియమించారు. జిల్లా బాధ్యతలకు సంబంధించి పల్నాడు జిల్లా వైసిపి అధ్యక్షులుగా మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నియమితులయ్యారు. బాపట్ల జిల్లాకు ఎంపి మోపిదేవి వెంకటరమణకు అవకాశం కల్పించారు. జులై 8, 9 తేదీల్లో నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట వైసిపి ప్లీనరీ అట్టహాసంగా జరిగింది. పార్టీ గౌరవాధ్యక్షులు విజయమ్మ తన పదవి నుంచి తప్పుకోగా వైఎస్ జగన్ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. పలు అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు పేరుతో సిఎం జగన్ పలుమార్లు

సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శిగా పాశం రామారావు, పల్నాడు జిల్లా కార్యదర్శిగా గుంటూరు విజయకుమార్ కొనసాగుతున్నారు. టిడిపి గుంటూరు జిల్లా అధ్యక్షులుగా తెనాలి శ్రావణ్‌కుమార్, పల్నాడు జిల్లా అధ్యక్షులుగా జి.వి.ఆంజనేయులు, బాపట్లకు ఏలూరు సాంబశివరావు కొనసాగుతున్నారు. కాంగ్రెస్‌కు జిల్లా అధ్యక్షులుగా లింగంశెట్టి ఈశ్వరరావు, బిజెపి పాటిబండ్ల రామకృష్ణ, జనసేన జిల్లా అధ్యక్షులుగా గాదె వెంకటేశ్వరరావు కొనసాగుతున్నారు. మార్చి 14న జనసేన ప్లీనరీ ఇప్పటం గ్రామంలో నిర్వహించారు.

ఊపందుకుంటున్న ఉద్యమాలు

ప్రభుత్వ ప్రజలపై మోపుతున్న పన్నుల భారంపై టిడిపి బాదుడే..బాదుడు కార్యక్రమాన్ని కొనసాగిస్తోంది. ఇటీవల చేపట్టిన 'రాష్ట్రానికి ఇదేం ఖర్మ' కార్యక్రమాన్ని జిల్లాలో వివిధ అంశాల వారీగా నిర్వహిస్తున్నారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు డిసెంబరు రెండో వారంలో రాష్ట్రానికి ఇదేం కర్మ కార్యక్రమంపై గుంటూరు, బాపట్ల జిల్లాల్లో పర్యటించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై వామపక్షాలు పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తున్నాయి. ప్రధానంగా సిపిఎం.. కేంద్ర ప్రభుత్వ మతతత్వ విధానాలు, కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించింది. విద్యుత్ సంస్కరణలు, కార్మిక చట్టాల రద్దు, నాలుగు లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా సార్వత్రిక సమ్మె నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ విద్యుత్ పంపుసెట్లకు మీటర్లు పెట్టడానికి వ్యతిరేకంగా వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహిస్తున్నారు. రాజధాని రైతులకు మద్దతుగా వైసిపి మినహా మిగిలిన అన్నిపార్టీలు వివిధ రూపాల్లో జరిగిన ఆందోళనల్లో పాల్గొన్నాయి. మూడు రాజధానులకు వ్యతిరేకంగా జరిగిన రెండో దశ పాదయాత్రలో టిడిపి, కాంగ్రెస్, వామపక్షాలు, బిజెపి వేర్వేరుగా పాల్గొన్నాయి. కాంగ్రెస్ పార్టీ కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక పాలనకు వ్యతిరేకంగా ఆందోళనలు నిర్వహించింది. జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్ ఇప్పటం, దూళిపాళ్ల గ్రామాల్లో పర్యటించారు.

దేశ వ్యాప్త పోరాటాలకు గుంటూరు నుంచి పిలుపు

పోరాటాలకు పురిటిగడ్డ ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఈ ఏడాది పలు కీలక సమావేశాలకు వేదికైంది. అఖిలభారత కిసాన్ సభ జాతీయ కౌన్సిల్, కౌలు రైతు సంఘం 3వ రాష్ట్ర మహాసభ, అంగన్‌వాడీ వర్కర్సు,హెల్పర్సు యూనియన్ 10వ రాష్ట్ర మహాసభ నవంబరు నెలలో గుంటూరు, పల్నాడు జిల్లాల్లో జరిగాయి. అఖిల భారత్‌కిసాన్ సభ (ఎఐకెఎస్) జాతీయ కౌన్సిల్ సమావేశాలు ఈనెల 19, 20 తేదీల్లో గుంటూరులో నిర్వహించారు. 2020లో బిజెపి ప్రభుత్వం పార్లమెంటులో ఆమోదించిన మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా 13 నెలల పోరాటం చేసిన రైతు సంఘాల్లో కీలక భూమిక పోషించిన ఎఐకెఎస్ భవిష్యతు పోరాటాలపై గుంటూరు వేదికగా నిర్వహించిన జాతీయ కౌన్సిల్ సమావేశంలో చర్చించింది. ఢిల్లీ సరిహద్దులో 2020 నవంబరు 26 నుంచి రైతుల నెలల పోరాటం మొదలుకాగా 13 నెలల తరువాత 2021 నవంబరు 19న మూడు చట్టాలను కేంద్రం రద్దు చేసింది. ఈ సందర్భంగా కేంద్రప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంపై జాతీయ కౌన్సిల్ సమావేశంలో చర్చించారు. ఆ హామీల అమలుతో పాటు రైతాంగం ఎదుర్కొంటున్న వివిధ సమస్య పరిష్కారం కోసం దేశ వ్యాప్తంగా రెండో దశపోరాటం చేయాలని గుంటూరులో జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఎఐకెఎస్ నాయకులు నిర్ణయించారు. పంటల ఉత్పత్తి వ్యయానికి 50 శాతం అధికంగా కేటాయిస్తూ మద్ధతు ధర చట్టం చేయాలని, విద్యుత్ సంస్కరణ బిల్లును ఉపసంహరించుకోవాలని, ప్రధాన మంత్రి వ్యవసాయ బీమా పథకాలను పునర్ వ్యవస్థీకరణ చేయాలని, రైతాంగ సమస్యలతో పాటు కార్మిక చట్టాల స్థానంలో తెచ్చిన లేబర్‌కోడ్స్ వ్యతిరేకంగా సిఐటియు, ఎఐకెఎస్, ఎఐఎడబ్ల్యూయు తదితర సంఘాలతో కలిసి దేశ వ్యాప్తంగా ఆందోళనకు రైతాంగాన్ని సన్నద్ధం చేయాలని ఎఐకెఎస్ నిర్ణయించింది.

నవంబరు 21, 22 తేదీల్లో చిలకలూరిపేటలో జరిగిన కౌలు రైతు సంఘం రాష్ట్ర మహాసభలో వైసిపి ప్రభుత్వం తెచ్చిన 2019 కౌల్దార్ల చట్టంలో సిసిఆర్‌సి జారీకి భూ యజమాని సంతకం నిబంధనను తొలగించే వరకు గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పోరాటం నిర్వహించాలని నిర్ణయించారు. నవంబరు 25,26 తేదీల్లో గుంటూరులో నిర్వహించిన అంగన్‌వాడీ వర్కర్సు, హెల్పర్స్ యూనియన్ 10వ రాష్ట్ర మహాసభలో జాతీయ, రాష్ట్ర నాయకులు కూడా భవిష్యత్తు పోరాటాలపై చర్చించారు. ప్రధానంగా అంగన్వాడీ వర్కర్లు హెల్పర్లు ఉద్యోగ విరమణ తర్వాత గ్రాట్యూటీ ఇవ్వాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు కోసం పోరాటం చేయాలని నిర్ణయించారు. కనీస వేతనం రూ 26 వేల ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రమోషన్లు, రవాణా ఛార్జీలు ఇవ్వాలని మహాసభ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

జెవివి 2023 కేలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు : మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా జన విజ్ఞాన వేదిక కార్యకర్తలు నూతన సంవత్సరంలో విస్తృత ప్రచారం చేయాలని జెవివి జిల్లా గౌరవాధ్యక్షులు, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు కోరారు. శుక్రవారం జెవివి నూతన సంవత్సర క్యాలెండర్‌ను స్థానిక బ్రాడీపేటలోని యుటిఎఫ్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక కాలంలో విద్యాధికులు కూడా మూఢనమ్మకాలను నమ్ముతున్నారని, మదనపల్లెలో జరిగిన సంఘటనే అందుకు నిదర్శమని అన్నారు. టెలివిజన్స్ ఛానల్స్ ద్వారా కూడా రంగురాళ్లు, కుబేర యంత్రాలు, న్యూమరాలజీ ఇంకా అనేక రకాల మూఢనమ్మకాలు విస్తృతంగా జరుగుతున్నాయని, వీటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో జెవివి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ ఎ.సత్యనారాయణ ప్రసాద్, బి.ప్రసాద్, జి.వెంకటరావు, టి.జాన్‌బాబు, ఎమ్‌డి అక్బర్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

